భీమవరం ఉష్ణోగ్రతలు

గరిష్ఠం : 30.0 కనిష్ఠం : 27.0

తణుకు : 29.0 - 25.0

ఉల్లి ఘాటు

కిలో గరిష్ఠంగా రూ.50.. మార్కెట్‌కు రాని కర్నూలు ఉల్లి



తాడేపల్లిగూడెం రూరల్, ఆగస్టు 7: ఉల్లి ధర పెరుగుతోంది. ఒక పక్క వర్షాలు ఉక్కిరిబిక్కిరి చేస్తుంటే మరో పక్క ఉల్లి చెమటలు పట్టిస్తోంది. గ్రేడ్ 1 ఉల్లి కిలో రూ.50కి రిటైల్‌లో విక్రయిస్తుండగా రెండో రకం ఉల్లి రూ.40కి అమ్ముతున్నారు. గ్రామాల్లో ఆటోలతో ఉల్లిపాయలు విక్రయించే వారు రూ.100కు రెండున్నర కేజీలు ఇస్తున్నారు. తాడేపల్లిగూడెం మార్కెట్‌కు గతంలో ఈ సమయంలో కర్నూలు ఉల్లి వచ్చిపడేది. కర్నూలు ప్రాంతంలో మే నెలలో వేసే ఉల్లి ఈ నెలలో రావాల్సి ఉంది. వర్షాల కారణంగా కోత ఆలస్యం అవుతుండటంతో తాడేపల్లిగూడెం మార్కెట్‌కు మహారాష్ట్ర ఉల్లి మాత్రమే దిగుమతి అవుతోంది. అక్కడ నుంచి కూడా ఉల్లి లోడ్లు ఎక్కువగా రాకపోవడంతో ఉల్లి ధరలు మరింత పెరిగే అవకాశం ఉందని వ్యాపారులు చెబుతున్నారు.

రానున్నది మరింత గడ్డు పరిస్థితి..

రాబోయే రోజుల్లో మహారాష్ట్ర నుంచి ఉల్లి దిగుమతి తగ్గే అవకాశాలు ఉండటంతో ఉల్లి ధరలు రాబోయే రోజుల్లో దిగివచ్చే అవకాశం కనిపించడం లేదు. ఈనెలాఖరు నాటికి కర్నూలు ఉల్లి దిగుమతి అయినా మహారాష్ట్ర ఉల్లి దిగుమతి తగ్గుముఖం పట్టడంతో ఉల్లి ధర పెరిగే అవకాశం తప్ప తగ్గే పరిస్థితి ఉండదని వ్యాపారులు చెబుతున్నారు.

చేనేతను ప్రోత్సహించాలి: కలెక్టర్



చేనేత కార్మికుడిని సన్మానిస్తున్న కలెక్టర్ నాగరాణి

భీమవరం టౌన్, ఆగస్టు 7: ప్రజలు చేనేత వస్త్రాలను ధరించడంతోపాటు, వాటిని ధరించడంలో వున్న సౌలభ్యంపై అవగాహన కలిగి ఉండాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు బుధవారం డీఎన్ఆర్ కళాశాలలో జిల్లా చేనేత శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జాతీయ చేనేత దినోత్సవం కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాగరాణి మాట్లాడుతూ చేనేతను ప్రోత్సహించాల్సిన అవసరం ఉన్నదని అన్నారు. ప్రపంచవ్యాప్తంగా 95 శాతం చేనేత ఉత్పత్తులు మన దేశం నుండే ఉన్నాయన్నారు. జిల్లాలో సుమారు 1027మంది చేనేత కార్మికులు ఉన్నారని తెలిపారు. ఈ సమావేశంలో తన దృష్టికి తీసుకువచ్చిన చేనేత కార్మికుల సమస్యలు, సూచనలను రాష్ట్ర ప్రభుత్వం దృష్టి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. చివరిగా సిద్ధాని విఘ్నేశ్వర రావు, సమతం చిన్న సముద్రం లింగం అనే ఇద్దరు చేనేత కార్మికులకు జిల్లా కలెక్టర్ సన్మానించారు.

పది, ఇంటర్ ఓపెన్ స్కూల్ అడ్మిషన్‌లు

భీమవరం ఎడ్యుకేషన్, ఆగస్టు 7 : సార్వత్రిక విద్యాపీఠం ద్వారా ఎస్ఎస్‌సతి, ఇంటర్మీడియట్ చదువుకోవడానికి ప్రభుత్వం అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభించిందని ఈ అవకాశాన్ని బడి మధ్యలో మానివేసినవారు, వివిధ వృత్తి వ్యాపారాలలో ఉన్నవారికి, సామాజికంగా ఆర్థికంగా వెనుకబడినవారికి ఒక మంచి అవకాశమని జిల్లా విద్యాశాఖాధికారి జి.నాగమణి తెలిపారు. పెనుమంత్ర మండలం మార్టేరు గ్రామంలోని రెడ్డి కళ్యాణ మండపంలో ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యాపీఠం 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి పదవ తరగతి, ఇంటర్మీడియట్‌లో ప్రవేశాలు, ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్ మీద బుధవారం నాడు జిల్లాస్థాయి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ పదవ తరగతిలో ప్రవేశానికి అభ్యర్థి ఎస్ఎస్‌సీ మధ్యలో మానివేసినవారు 14 సంవత్సరాలు వయస్సు ఆగస్టు 31 నాటికి నిండి చదవడం, రాయడం వచ్చినవారు అర్హులన్నారు. ఇంటర్మీడియట్ ప్రవేశం కోసం పదవ తరగతి పూర్తి చేసి ఆగస్టు 31 నాటికి 15 సంవత్సరాలు వయస్సు నిండినవారు అర్హులన్నారు. ప్రవేశాల కోసం రిజిస్ట్రేషన్ ఆఖరు తేదీ ఈనెల 28తో ముగుస్తుంది. అదేవిధంగా అపరాధ రుసుము రూ.200తో 4-9-2024 వరకు గడువు కలదన్నారు. ఓపెన్ స్కూల్స్ సొసైటీకి సంబంధించి 2024-25 విద్యాప్రవేశాలకు సంబంధించిన ఓపెన్ స్కూల్స్ వలన ప్రయోజనాలు విద్యాశాఖ అసిస్టెంట్ ఎన్ సత్యనారాయణ, స్టేట్ ఓపెన్ స్కూల్ కోఆర్డినేటర్ జి.శివ కోటేశ్వరరావు తెలియజేశారు. మరిన్ని వివరాల కోసం మీ దగ్గరలో గల ఏఐ కోఆర్డినేటర్‌లు, ప్రిన్సిపాల్స్, జూనియర్ కాలేజీ, సమగ్ర శిక్షణ సెక్టోరియల్ ఆఫీసర్స్, మండల విద్యాశాఖాధికారులు, ఉప విద్యాశాఖాధికారులను సంప్రదించాలన్నారు.

నేడే స్కూళ్లలో ఎన్నికల సందడి



జిల్లాలోని 1341 ప్రభుత్వ స్కూళ్ళల్లో గురువారం స్కూల్ కమిటీ ఎన్నికలు జరగనున్నాయి. 2021 తరువాత మళ్లీ ఇప్పుడే ఎన్నికలు జరుగుతున్నాయి. ప్రభుత్వం అధికారంలో ఉండటంతో కూటమి తరపున బరిలో నిలిచేందుకు పలువురు విద్యార్థుల తల్లితండ్రులు పోటీ పడుతున్నారు. దీంతో చాలా స్కూళ్ళల్లో చైర్మన్ స్థానానికి గట్టి పోటీ ఏర్పడనుంది.

- జిల్లాలో 1341 స్కూళ్ళలో ఎన్నికలు
- ముందుగా కమిటీ, మధ్యాహ్నం నుంచి చైర్మన్, వీసీల ఎన్నికలు
- కొన్ని స్కూళ్ళల్లో పోటాపోటీ

నరసాపురం, ఆగస్టు 7: జిల్లాలో స్కూల్ కమిటీల ఎన్నికలకు విద్యాశాఖ అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. షెడ్యూల్ ప్రకారం ఉదయం కమిటీ ఎన్నికలు జరుగుతాయి. మధ్యాహ్నం ఈ కమిటీ సభ్యుల్లో ఇద్దరిని చైర్మన్, వైస్ చైర్మన్‌గా ఎన్నుకుంటారు. అనంతరం వీరిద్దరి చేత ప్రమాణ స్వీకారం చేయిస్తారు. ఈ ప్రక్రియంతా సాయంత్రానికి ముగియనుంది. జిల్లాలో తొమ్మిది గురుకుల పాఠశాలలు మినహాయించగా 1341 స్కూల్స్‌కు ఎన్నికలు జరుగుతాయి. జిల్లాలో 1060 ప్రాథమిక, 81 ప్రాథమికోన్నత, 209 హైస్కూళ్లు ఉన్నాయి. షెడ్యూల్ ప్రకారం ప్రాథమిక పాఠశాలల్లో ఒక్కొక్క తరగతికి ముగ్గురు చొప్పున కమిటీ సభ్యులుగా ఎన్నుకుంటారు. ఐదు తరగతులకు 15 మంది విద్యార్థి తల్లిదండ్రుల్ని కమిటీ సభ్యులుగా ఎన్నుకుంటారు. ఈ కమిటీల్లో ఇద్దరు మహిళలు ఉండాలి. దీంతో పాటు ఎన్నుకునే ముగ్గురిలో ఎస్సీ, ఎస్టీ, ఓసీ, బీసీలు ఉండాలి. అలాగే ప్రాథమికోన్నత, హైస్కూల్‌లో కమిటీ సభ్యుల్ని ఎన్నుకుని వారిలో ఇద్దరిని చైర్మన్, వైస్ చైర్మన్‌గా ఎన్నుకుంటారు. ఈ ఎన్నికల ప్రక్రియ గురించి ఇప్పటికే ఉపాధ్యాయులు విద్యార్థుల తల్లితండ్రులకు అవగాహన కల్పించడంతో పాటు ఓటర్ల లిస్టును కూడా స్కూల్‌లో పెట్టి అభ్యంతరాలను స్వీకరించారు. ఏకాభిప్రాయంతోనే కమిటీ సభ్యుల్ని ఎన్నిక చేసేందుకు ప్రయత్నిస్తారు. ఎవరైనా పోటీ ఉంటే ఎన్నిక పెడతారు. అయితే ప్రాథమిక, ప్రాథమికోన్నత స్కూళ్ళల్లో అనుకున్న స్థాయిలో పోటీ లేదు. పోటీ అంతా... హైస్కూల్ స్థాయిలోనే ఉంది.

చైర్మన్ పదవి కావడం, స్కూల్ అభివృద్ధి అంతా చైర్మన్ కనుసన్నల్లోనే ఉండటం, చెక్ పవర్ కూడా ఉండటం, స్కూల్‌ను అభివృద్ధి వంటి కీలక బాధ్యతలు చైర్మన్‌కు ఉండటంతో ఈసారి చాలా మంది ఈ పదవికి పోటీపడుతున్నారు. అయితే మండలాల్లోని హైస్కూళ్ళల్లో ఎక్కువ పోటీ నెలకొంది. ఇది కూడా కూటమి పార్టీల నుంచే. జనసేన, టీడీపీ, బీజేపీల నుంచి పలువురు విద్యార్థుల తల్లిదండ్రులు చైర్మన్ పదవిని కోరుకుంటున్నారు. పేరుకు ఎన్నికలు ఉన్నప్పటికీ ఇది నామమాత్రమే కావడంతో తమకు ఛాన్స్ ఇవ్వాలని పార్టీ నేతలపై ఒత్తిడి తీసుకొస్తున్నారు. దీంతో కొన్ని స్కూళ్ళల్లో ఈ కమిటీ ఎన్నికలు రసవత్తరంగా మారాయి. ఇప్పటికే కొన్ని నియోజకవర్గాల్లో పార్టీ నేతలతో సమావేశమై ఏకాభిప్రాయంతో ఎన్నికలు జరిగేలా ఒప్పందం చేసుకుంటున్నారు.

టీడీఆర్ బాండ్‌లకు చెక్



వైసీపీ హయాంలో అక్రమాలు ఇప్పుడు కూటమి ప్రభుత్వాన్ని వెంటాడుతున్నాయి. పట్టణాలు, నగరాల్లో టీడీఆర్ బాండ్‌ల జారీని నిలిపివేశారు. అత్యవసరమైనా సరే మునిసిపాలిటీలు బాండ్‌లు జారీ చేయడానికి వీలు లేకుండా పోయింది. కొత్త మార్గదర్శకాలు వచ్చేంత వరకు టీడీఆర్ బాండ్‌లు మంజూరు చేయకూడదంటూ మున్సిపల్ శాఖ ఆదేశాలు జారీచేసింది. దాంతో మున్సిపాలిటీలకు చెక్ పడినట్టయింది. మునిసిపాలిటీకి స్థల సేకరణ అత్యవసరమైనా సరే బాండ్‌లు ఇవ్వడానికి అవకాశం లేదు. ప్రభుత్వం నుంచి మార్గదర్శకాలు వస్తేనే వెసులుబాటు లభించనుంది.

- బాండ్‌ల మంజూరు నిలిపివేత
- మార్గదర్శకాలు వస్తేనే జారీ
- వైసీపీ అక్రమ దందాతో నిలుపుదల చేసిన కూటమి ప్రభుత్వం
- జిల్లాలో తాడేపల్లిగూడెం, తణుకులో కుంభకోణం
- కాలయాపన కమిటీలతో సరి
- రంగంలోకి దిగనున్న సీబీసీఐడీ

(భీమవరం-ఆంధ్రజ్యోతి)

వైసీపీ ప్రభుత్వంలో అక్రమంగా ఇచ్చిన టీడీఆర్ బాండ్‌లతో ఇప్పుడు నష్టం జరుగుతోంది. జిల్లాలో తణుకు, తాడేపల్లిగూడెం మునిసిపాలిటీల్లో ఇష్టానుసారంగా వైసీపీ హయాంలో జారీచేశారు. కోట్లాది రూపాయలు కుంభకోణం జరిగింది. రెండు పట్టణాల్లోనూ ఇద్దరు మాజీ ప్రజాప్రతినిధులు టీడీఆర్ బాండ్లతో కోట్ల రూపాయలు కొల్లగొట్టారు. వాటిపై ఇప్పుడు సీబీసీఐడీ విచారణ జరగనుంది. తొలుత శాఖాపరమైన విచారణ చేపడతారు. ఆ తర్వాత సీబీసీఐడీ రంగంలోకి దిగనుంది. ఆ దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంది. బాండ్‌లు ఎవరికి జారీ చేయాలి? ఎవరు అర్హులు? రెండు మునిసిపాలిటీల్లోనూ ఎవరికి జారీ చేశారు? వాటిని ఎవరికి విక్రయించారు? ఎవరి ఖాతాలో అమ్మకం సొమ్ములు జమ అయ్యాయి? ఇలా అన్ని కోణాల్లోనూ సీబీసీఐడీ దర్యాప్తు చేయనుంది. బాధ్యులపై చర్యలకు ఉపక్రమించనుంది. సీబీసీఐడీ అనగానే అధికారుల్లో అలజడి రేగింది.

తాడేపల్లిగూడెంలో సర్దుబాటుకు ప్రయత్నాలు

తాడేపల్లిగూడెం మునిసిపాలిటీలో టీడీఆర్ బాండ్‌లు జారీచేసిన అధికారులు, లబ్ధిపొందిన బిల్డర్‌లు, దళారుల వెన్నులో వణుకు పుడుతోంది. కూటమి నేతలతో సంప్రదింపులు జరుపుతున్నారు. తాడేపల్లిగూడెం-భీమవరం రహదారికి అనుకుని 1400 చదరపు గజాల్లో టీడీఆర్ బాండ్‌లు జారీచేసిన అంశం ఇప్పుడు అందరి మెడకు చుట్టుకుంటోంది. ఈ ఒక్క చోటే బాండ్‌ల జారీలో దాదాపు 12.00 కోట్లు చేతులు మారాయి. అపార్ట్‌మెంట్ నిర్మాణం కోసం బిల్డర్‌కు స్థలం ఇచ్చిన పాపానికి భూయజమానులు నష్టపోయారు. బాండ్‌లు జారీ అయితే వాటిని కూడా అపార్ట్‌మెంట్‌కే వినియోగించుకోవాలని బిల్డర్‌తో స్థల యజమానులు ఒప్పందం చేసుకున్నారు. దానిని ఆసరాగా చేసుకుని బిల్డర్ మున్సిపాలిటీకి 1400 చదరపు గజాలను రాసిచ్చేశారు. బిల్డర్ పేరుతోనే బాండ్‌లు జారీచేశారు. ఇది మొదటి తప్పిదం. దానిని బిల్డర్ ఇతరులకు విక్రయించారు. ఇది రెండో పొరపాటు. వచ్చిన సొమ్ములో వైసీపీ మాజీ ప్రజాప్రతినిధి ఖాతాలోకి జమ చేశారు. అందుకోసం కొత్త ఖాతాను సృష్టించారు. మాజీప్రజాప్రతినిధి ఖాతాలోకి వెళ్లిన తర్వాత టీడీఆర్ బాండ్ విక్రయించిన సొమ్ముల ఖాతాను రద్దు చేశారు. అంతా పక్కాగా ఉందని అధికారులు, దళారులు, వైసీపీ నేతలు భావించారు. కానీ అన్ని రికార్డులతో సహా కూటమి నేతలు సిద్ధంగా ఉన్నారు. సీబీసీఐడీ రంగంలోకి దిగితే మరింత లోతుగా దర్యాప్తు జరుగుతుంది. అందరి కథ తేలిపోతుంది. ఫలితంగా బాండ్‌లు జారీ చేసిన అధికారులు కూటమి నేతలతో సంప్రదింపులు జరుపుతున్నారు. దళారులు, బిల్డర్‌లు కొంత సొమ్మును స్థల యజమానులకు ఇచ్చేలా చర్యలు సాగుతున్నాయి. తణుకులోనూ టీడీఆర్ దందాపై అధికార గణంలో అలజడి పుడుతోంది. అక్కడ కూడా భూయజమానులతో ఒప్పందం చేసుకున్న వారి పేరుమీదే కంపోస్ట్ యార్డుకోసమని బాండ్‌లు జారీ అయ్యాయి. దాదాపు రూ. 900 కోట్ల విలువైన టీడీఆర్ బాండ్‌లను తణుకులో మంజూరు చేశారు. వాటిని వైసీపీ ప్రభుత్వంలోనే బ్లాక్ చేశారు. అప్పటి కమిషనర్, టీపీవోను సస్పెండ్ చేశారు. విచారణ కమిటీని నియమించారు. సదరు కమిటీ నివేదిక ఇచ్చింది. వైసీపీ హయాంలో కావాలనే కమిటీ నివేదికను తొక్కిపెట్టారు. తాడేపల్లిగూడెంలో మంజూరైన బాండ్‌లపైనా జిల్లా కలెక్టర్ కమిటీ నియమించారు. సదరు కమిటీ వివరాలు సేకరించింది. కానీ చర్యలు లేవు.

ప్రభుత్వ విచారణ ఎప్పుడో....

కూటమి ప్రభుత్వమే తణుకు, తాడేపల్లిగూడెంలో శాఖాపరమైన విచారణ చేపడుతుంది. ఆ తర్వాత సీబీసీఐడీ రంగంలోకి దిగుతుంది. ప్రభుత్వ విచారణ కోసం ఇప్పుడంతా ఎదురుచూస్తున్నారు. వైసీపీ హయాంలో సాగిన బాండ్‌ల దందాపై చర్యలు తీసుకోకపోతే మళ్లీ అదేరకమైన తప్పిదాలు చోటు చేసుకోనున్నాయి. గతంలో లబ్ధిపొందిన వైసీపీ నేతలకు నష్టమేమీ ఉండదు. పైగా కోట్లు రూపాయలు దోచుకుని దర్జా వెలగబోస్తున్నారు. విమర్శలు చేసిన కూటమి నేతలపై ఎదురుదాడి చేస్తున్నారు. టీడీఆర్ దందా బట్టబయలు చేసిన మీడియాపైనా అక్కసు వెళ్లగక్కుతున్నారు. బాండ్‌ల జారీలో ప్రభుత్వం త్వరితగతిన చర్యలు తీసుకోవాల్సి వుంది.

ఎందుకు జారీ చేస్తారంటే...

రహదారి విస్తరణ కోసం పట్టణాల్లో టీడీఆర్ బాండ్‌లు మంజూరు చేస్తారు. మునిసిపాలిటీ వద్ద నిధులు ఉండవు. ప్రభుత్వం అంత పెద్దమొత్తంలో నిధులు సమకూర్చలేదు. దాంతో గజానికి నాలుగు రెట్లు వంతున బాండ్‌లు మంజూరు చేస్తారు. అంటే రూ.10వేల విలువైన స్థలానికి రూ. 40వేలు విలువైన బాండ్‌లు జారీ కానున్నాయి. వీటిని మార్కెట్‌లో 40శాతానికి యజమానులే విక్రయించుకుంటారు. అంటే స్థల యజమానికి మార్కెట్ ధరకంటే అధికంగా సొమ్ములు వస్తాయి. మాస్టర్ ప్లాన్‌కు అనుగుణంగా మున్సిపాలిటీ రహదారి విస్తరణ చేసుకోవడానికి అవకాశం ఉంటుంది. స్థలం ఇచ్చిన యజమానులకు నష్టం ఉండదు. మున్సిపాలిటీ బాండ్‌ల రూపంలో యజమానులకు లబ్ధి చేకూరుస్తుంది. టీడీఆర్ బాండ్‌ల వల్ల ఇటు మునిసిపాలిటీలకు స్థలసేకరణలో ఆర్థిక భారం ఉండదు. కానీ తణుకులో కంపోస్ట్ యార్డు కోసం సెంట్లలో సేకరించాల్సిన స్థలాన్ని గజాల్లో సేకరించారు. బాండ్‌లు జారీచేశారు. తాడేపల్లిగూడెంలో రహదారి విస్తరణ జరగదని తెలిసీ కూడా అవసరం లేకుండానే మున్సిపాలిటీ స్థలాలను సేకరించింది. బాండ్‌లు ఇచ్చింది. స్థల యజమానులకు తెలియకుండా బిల్డర్ పేరుతో ఇచ్చేసింది. స్థలాలను స్వాధీనం చేసుకోలేదు. వీటన్నింటినీ పరిగణలోకి తీసుకున్న తెలుగుదేశం కూటమి ప్రభుత్వం ఆలోచనలో పడింది. కొత్త మార్గదర్శకాలు విడుదల చేయడానికి సమాయత్తమైంది. టీడీఆర్ బాండ్‌ల జారీని నిలిపివేసింది.

స్థలాలపై కన్ను

తణుకు, తాడేపల్లిగూడెం పట్టణాల్లో జారీ చేసిన టీడీఆర్ బాండ్‌లపై ప్రాథమికంగా ప్రభుత్వం దృష్టి పెట్టింది. బాండ్‌లు జారీచేసిన స్థలాలను స్వాధీనం చేసుకున్నారా లేదా అనే విషయమై ఆరా తీస్తోంది. ఇప్పటికీ సదరు స్థలాలను స్వాధీనం చేసుకోలేదు. సదరు స్థలంలో వ్యాపారులు చేసుకుంటున్నారు. నిబంధనలకు విరుద్ధంగానే ఓ కళ్యాణ మండపం పేరుతో ఉన్న ఎదురు స్థలానికి తాడేపల్లిగూడెంలో బాండ్‌లు ఇచ్చారు. దానిని మున్సిపాలిటీ సద్వినియోగం చేసుకోవడం లేదు. రహదారి విస్తరణ ఎలాగా ఉండదు. అందుకే వైసీపీ నేత తన స్థలాన్ని మున్సిపాలిటీకి ఇచ్చేశారు. కూటమి నేతల ఒత్తిడితో మున్సిపాలిటీ గతంలో హద్దులు వేసింది. అంతే తప్పా అంతకు మించి చర్యలు తీసుకోలేదు. ఇటువంటి వాటిపై ఇప్పుడు ప్రభుత్వం దృష్టి పెట్టినట్టు సమాచారం.

పుష్కరఘాట్‌లపై బురద ..



ఆచంట మండలంలో పుష్కరఘాట్

ఇటీవల గోదావరి వరద కారణంగా నదీ పరీవాహక ప్రాంతాల్లోని ఆచంట, పెనుగొండ, యలమంచిలి, నరసాపురం ప్రాంతాల్లోని పుష్కరఘాట్‌లు మునిగిపోయాయి. ప్రస్తుతం వరద తగ్గుముఖం పట్టడంతో పుష్కరఘాట్‌లు బయట పడ్డాయి. కాని పుష్కరఘాట్‌లన్నీ బురద మట్టితో కప్పబడి పోయాయి. శ్రావణ, కార్తీక మాసాల్లో భక్తులు గోదావరి పుణ్యస్నానాలు చేసి నది ఒడ్డున ఉండే ఆలయాల్లో పూజలు చేస్తుంటారు. బురద మట్టి కారణంగా ఘాట్‌ల వద్ద భక్తులు స్నానాలు చేయడానికి వీలు లేదు. వెంటనే అధికారులు స్పందించి ఘాట్‌లు శుభ్రం చేయాలని భక్తులు కోరుతున్నారు.

\- ఆచంట

ఎర్రకాల్వ ఉధృతి..

రైతులను నిండా ముంచిన ఎర్రకాలువ వదలని వర్షాలతో మళ్లి పెరుగుతోంది. నిన్నటి వరకూ ప్రశాంతంగా ఉన్న ఎర్రకాల్వ ఉధృతి మళ్లీ పెరిగి రైతులను భయపెడుతోంది. ఇప్పటికే మండలంలోని అప్పారావుపేట, మాదవరం, జగన్నాథపురం, మారంపల్లి, నందమూరు, ఆరుళ్ల గ్రామాల్లో వందల ఎకరాల వరి పంట నాశనం కావడంతో మెరకలో కొంత పాడైన వరిచేలను మళ్లి పునరుద్ధరించే పనిలో ఉన్న రైతులకు మళ్లీ పెరుగుతున్న ఎర్రకాలువ గుబులు పుట్టిస్తోంది. వర్షాలు ఇంకా వీడకపోవడంతో ఎర్రకాలువ వరద మళ్లీ మొదలవుతుందా అని ఆయా గ్రామాల ప్రజలు భయాందోళనలో ఉన్నారు.

\- తాడేపల్లిగూడెం రూరల్



మాధవరం-కంసాలిపాలెం మధ్య ఉధృతంగా ఎర్రకాల్వ



రికార్డులు పరిశీలిస్తున్న ఆడిట్ అధికారులు

జగనన్న కాలనీల్లో ఆడిట్ బృందం తనిఖీ

భీమవరం టౌన్, ఆగస్టు 7 : జగనన్నకాలనీలలో లబ్ధిదారులకు కేటాయించిన ఇళ్ళ స్థలాలు, లే- అవుట్‌లను బుధవారంనాడు జిల్లా ఆడిట్ బృందం తనిఖీలు నిర్వహించింది. ఆకివీడు, భీమవరంలోని లే-అవుట్‌లను పరిశీలించారు. ఎంత మందికి కేటాయించారు. ఇప్పటి వరకు ఎన్ని ఇళ్ళ నిర్మాణం పూర్తి అయింది. ఎంతమంది లబ్ధిదారులు ఉంటున్నారు. లబ్ధిదారులకు అందించే సిమెంట్, ఇసుక, ఐరన్ నిల్వలను పరిశీలించి రికార్డులను పరిశీలించి వివరాలను నమోదు చేసుకున్నారు. హౌసింగ్‌శాఖ అధికారులతో చర్చించారు. బృందం వెంట గృహనిర్మాణ శాఖ పీడీ జి పిచ్చియ్య, డీఈ శివరామరాజు, ఏఈలు సాంబశివరావు, రామకృష్ణంరాజు తదితరులు పాల్గొన్నారు.

సాగుదారుడికే పరిహారం

తాడేపల్లిగూడెం రూరల్, ఆగస్టు 7: వరదలు, అధిక వర్షాలకు నష్టపోయిన పంట పరిహారం సాగుదారుడికే అందించనున్నారు. జిల్లాలో ఇటీవల వచ్చిన వరదలకు, అధిక వర్షాలకు పంట నష్టం ఏర్పడటంతో ఆ పంట నష్టపరిహారం సాగుచేసేవారికే అందించేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నది. ప్రభుత్వ ఉద్దేశంలో వేసిన పంటకే పరిహారం అందిస్తుండటంతో అది వాస్తవంగా భూమిపై పంట వేసి నష్టపోయిన వారికే అందించేలా చర్యలు తీసుకుంటున్నారు. వాస్తవంగా భూ యజమాని వేరే ఉన్నా ఆ యజమానికి భూమిపై హక్కు ఉంటుందని వేసిన పంటపై కౌలుదారుడికే పరిహారం అందించేలా రాష్ట్ర క్యాబినెట్ తీర్మానించింది. దీంతో ఈ తరహాలో వాస్తవ సాగుదారుడి పేర్లు నమోదుచేసి పరిహారం అందించేలా నిర్ణయించారు. ప్రస్తుత ఖరీఫ్‌కే పరిహారం వర్తిస్తుందని వ్యవసాయాధికారులు చెబుతున్నారు. ఈ విషయంలో భూ యజమానులు ఎలాంటి అపోహలకు లోనుకారాదని స్పష్టం చేస్తున్నారు.

జిల్లాలో 29,500 ఎకరాల్లో పంట నష్టం

జిల్లాలో వర్షాలకు, వరదలకు 2600 ఎకరాల్లో వరి ఆకుమడులు, 29500 ఎకరాల్లో పంట నష్టం వాటిల్లినట్టు వ్యవసాయాధికారులు ప్రాథమికంగా అంచనా వేశారు. ఈ లెక్కన జిల్లాలో 17500 మంది రైతులు నష్టపోయినట్టు గుర్తించారు. ముఖ్యంగా తాడేపల్లిగూడెం, తణుకు, పెంటపాడు మండలాల్లో ఎర్రకాలువ వరదలకు భారీగా పంట నష్టం ఉండగా వర్షాలకు, పెనుగొండ, వీరవాసరం, పాలకొల్లు తదితర మండలాల్లో పంట నష్ట పోయినట్టు అధికారులు అంచనా వేశారు.



నందమూరులో నీట మునిగిన పొలంలో రైతు

యాప్‌లో నమోదు

నష్టపోయిన వరిచేల వద్ద వ్యవసాయాధికారులు రైతు సమక్షంలో ఈ పరిహారం జియో ఫెన్సింగ్ యాప్‌లో నమోదుచేసి ప్రభుత్వానికి నివేదికలు అందిస్తారు. ఈ ప్రక్రియలో రైతు, పంట వివరాలు, రకము, విస్తీర్ణం, నీటిపారుదల పద్ధతులు అంశాలు నమోదు చేస్తారు.

సీసీఆర్‌సీ కార్డులు తప్పనిసరి

నష్ట పరిహారం పొందాలంటే కౌలు రైతులు తప్పనిసరిగా సీసీఆర్‌సీ కార్డులు తీసుకోవాల్సి ఉంటుంది. ఈ కార్డులను వీఆర్‌వో వద్ద తీసుకోవాల్సి ఉంటుంది. ఈ కార్డుల ద్వారా ప్రభుత్వం రాయితీపై అందించే విత్తనాలు, యంత్రాలు, కౌలుదారులకు రుణాలు, వడ్డీరాయితీ, పంటల బీమా తదితర పథకాలు పొందే అవకాశాలు ఉంటాయి.



కారు..బీభత్సం

మహిళ మృతి..

నలుగురికి గాయాలు

ఐదు బైక్‌లు నుజ్జు నుజ్జు

మద్యం మత్తులో విద్యుత్ స్తంభం ఎక్కాడు

| 7

అసంపూర్తిగా నాడు-నేడు భవనాలు



నిలిచిపోయిన నందమిల్లిపాడు ఎంపీపీ పాఠశాల భవనం పనులు

నిధులు లేక నిలిచిన పనులు

ఆకివీడురూరల్ ఆగస్టు 7 : నిధులు మంజూరు అవపోవడంతో పనులు ప్రారంభించి సంవత్సరం గడిచినా నిర్మాణాలు పూర్తి కాలేదు. భవనాలు విద్యార్థులకు అందుబాటులోకి రాలేదు. ఆకివీడు మండలంలోని అప్పారావుపేట, నందమిల్లిపాడు, తాళ్ళకోడు గ్రామాలలో రెండోవిడత నాడు-నేడులో అదనపు తరగతి గదులకు నిధులు మంజూరయ్యాయి. నందమిల్లిపాడు ఎంపీపీ పాఠశాలకు రూ. 41 లక్షలు మంజూరవగా రూ. 30 లక్షలతో నిర్మాణం చేశారు. రెండో అంతస్థులో గదికి గోడలు నిర్మించాలి.. వైరింగ్, టైల్స్, కుర్చీలు, బల్లలు ఏర్పాటు వంటి పనులు చేయాల్సి ఉంది. దీంతో విద్యార్థులకు సమీపంలోని అంగన్‌వాడీ భవనంలో తరగతులు నిర్వహిస్తున్నారు.తాళ్ళకోడులో రూ.24 లక్షలతో రెండు అదనపు తరగతి గదులు నిర్మాణం ప్రారంభించారు. టైల్స్, రంగులు వెయ్యడం, తలుపులు, ఏర్పాటు పెండింగ్‌లో ఉంది. అప్పారావుపేటలో రూ. 44 లక్షలతో రెండు తరగతి గదులు, కిచెన్, టాయిలెట్, ప్రహరీగోడ, నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయి. సుమారు రూ.7 లక్షలు విలువైన పనులు ఆగిపోయాయి. తలుపులు, కిటికీలు, వైరింగ్, టేబుల్స్ చైర్స్ వంటివి ఏర్పాటు చెయ్యాల్సి ఉంది. ఈ సమస్యను ఎమ్మెల్యే రఘురామకృష్ణ రాజు దృష్టికి తీసుకెళ్లేందుకు విద్యార్థులు, తల్లిదండ్రులు ప్రయత్నిస్తున్నారు.



అంగన్‌వాడీ పాఠశాలలో తరగతులు నిర్వహిస్తున్న దృశ్యం

రోడ్డేశారు !

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



తణుకు, ఆగస్టు 7 : తణుకు రైల్వే స్టేషన్ రోడ్డుకు మోక్షం లభించింది. ఐదేళ్ల నుంచి అభివృద్ధికి నోచుకోక రోడ్డు పూర్తిగా దెబ్బతింది. రోడ్డుపై గోతులు పడి వర్షం వస్తే వాహనదారులు నానా అవస్థలు పడుతున్నారు. 'ఆంధ్రజ్యోతి'లో బుధవారం దీనిపై ప్రచురితమైన కథనానికి ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ స్పందించారు. అధికారులతో మాట్లాడి యుద్ధ ప్రాతిపదికన రోడ్డు మరమ్మతులు చేయాలని ఆదేశించారు. వెంటనే అధికారులు రోడ్డుకు మరమ్మతులు చేయించారు. ఏళ్ల తరబడి ఉన్న సమస్యను పరిష్కరించడంతో ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణకు పట్టణ వాసులు కృతజ్ఞతలు తెలిపారు.

చంద్రన్న బీమా రూ.10 లక్షలకు పెంపు

కొత్తగా లాయర్లు, జర్నలిస్టులకు అర్హత

పథకాన్ని నిర్వీర్యం చేసిన వైసీపీ ప్రభుత్వం

ఏలూరుటూటౌన్, ఆగస్టు 7: చంద్రన్న బీమా పథకాన్ని రూ.10 లక్షలకు పెంచారు. అసంఘటిత రంగ కార్మికుల కోసం 2016 అక్టోబర్ 2న అప్పటి టీడీపీ ప్రభుత్వం ఈ పథకాన్ని ప్రవేశపెట్టింది. ఉమ్మడి జిల్లాలో 17,77,362 మంది పేర్లు నమోదు చేసుకున్నారు. ఒకే కుటుంబంలో 18 సంవత్సరాలు దాటిన వారు ఎంత మంది ఉంటే అంత మంది అర్హులు. వైసీపీ ప్రభుత్వం వచ్చాక కుటుంబంలో ఒకరికే పరిమితం చేసింది. దీంతో అర్హులైన పేదలు ఎంతో మంది నష్టపోయారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో 2016 నుంచి 2019 వరకు 18,601 మందికి క్లైముల ద్వారా 182 కోట్ల 72 లక్షల 42114 రూపాయలు చెల్లించింది. తదనంతరం వైసీపీ ప్రభుత్వ హయాంలో 2019 నుంచి 2024 వరకు ఐదు సంవత్సరాల్లో 7,788 మందికి 99 కోట్ల 22 లక్షలు మాత్రమే చెల్లించారు. జగన్ ప్రభుత్వం వచ్చిన 16 నెలల వరకు ఈ పథకాన్ని పట్టించు కోలేదు. చంద్రన్నబీమా తొలగించి వైఎస్సార్ బీమా పథకంగా మార్పు చేసింది. ఆ కాలంలో మరణించిన పేదలైన కార్మిక కుటుంబాలు నష్టపోయాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే చంద్రన్న బీమాగా పేరు మార్చారు. ఎన్నికలకు ముందు చంద్రబాబునాయుడు ఇచ్చిన హామీ మేరకు చంద్రన్న బీమాను రూ.10 లక్షలకు పెంచుతున్నట్లు కార్మిక శాఖ మంత్రి వాసం శెట్టి సుభాష్ ప్రక టించారు. సహజ మరణం చెందితే రూ.5 లక్షలు చెల్లిస్తామని తెలిపారు. కొత్తగా ఈ పథకంలోకి న్యాయవాదులను, మీడియా సభ్యులను కూడా చేర్చుతున్నట్లు మంత్రి ప్రకటించారు.



ఈ పథకంలో 18 సంవత్సరాల నుంచి 60 సంవత్సరాల లోపు వయసు గలవారు సహజ మరణం చెందితే రూ.30 వేలు, ప్రమాద మరణానికి రూ.5 లక్షలు,పూర్తిగా వైకల్యం కలిగితే రూ.5 లక్షలు, పాక్షిక అంగవైకల్యానికి రూ.3,62,500 చెల్లిం చారు. 60-70 సంవ త్సరాల వయసు లోపు వారు ప్రమాద వశాత్తు మరణించినా, పూర్తి అంగవైకల్యం పొందినా రూ.4,25,000, పాక్షిక అంగ వైకల్యానికి రూ.3,25,000 ఇచ్చేవారు. అంతేకాకుండా చని పోయిన వ్యక్తి కుటుంబ సభ్యుల్లో ఇద్దరికి 9వ తరగతి నుంచి ఇంటర్మీ డియట్, ఐటీఐ చదివే పిల్లలకు ఒక్కొక్కరికి రూ.1200 చొప్పున స్కాలర్‌షిప్‌లు అందించేవారు.

విధి విధానాలు ఖరారు కాలేదు

విజయరాజు, ప్రాజెక్టు డైరెక్టర్, డీఆర్‌డీఏ



చంద్రన్న బీమా పథకాన్ని రూ.10 లక్షలకు పెంచుతూ మంత్రి సుభాష్ ప్రక టన చేశారు. కానీ ఇంకా ప్రభుత్వం విధి విధానాలు ఖరారు చేయలేదు. త్వరలో ప్రభుత్వం ఈ పథకం విధివిధానాలు రూపొందిస్తుంది. అన్ని రంగాల కార్మికులు, అసంఘటిత రంగ కార్మికులు తమ పేర్లను సచివాలయాల్లో నమోదు చేసుకోవచ్చు. ఈ ఏడాది జూన్ 30వ తేదీలోపు క్లైముల పరిష్కారం కానివారికి ప్రభుత్వం అవకాశం కల్పిస్తుంది. త్వరలో వారికి కూడా బీమా సొమ్ము అందుతుంది. ప్రభుత్వం నుంచి స్పష్టమైన ఆదేశాలు రావాల్సి ఉంది.

టీచర్ల 'పని సర్దుబాటు' కు సిద్ధం

మండలాల్లో 10, 11 తేదీల్లో ఆన్‌లైన్ కౌన్సెలింగ్, నియామక ఉత్తర్వులు

12 నుంచి నూతన బదిలీ స్థానాల్లో తాత్కాలిక విధులు

జూనియర్లకే స్థానభ్రంశం



ఏలూరు అర్బన్, ఆగస్టు 7 : టీచర్ల వర్క్ అడ్జస్ట్‌మెంట్ ప్రక్రియ తుది దశకు చేరుకుంది. బుధవారం పాఠశాలవిద్య ఉన్నతాధికారులు నిర్వ హించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఈ మేరకు స్పష్టతనిచ్చారు. తాజా షెడ్యూలు ప్రకారం మండలాల్లో పాఠశాలల వారీగా మిగులు (సర్‌ప్లస్) టీచర్లు, కొరతవున్న పాఠశాలల జాబితాలను శుక్రవారం సంబంధిత ఎంఈవోలకు ఆన్‌లైన్ లింక్‌ద్వారా తెలియజేస్తారు. ఆ ప్రకారం కేడర్ సీని యార్టీ వివరాలను కూడా పంపిస్తారు. దీనికనుగుణంగా సర్‌ప్లస్ జాబి తాల్లో ఆయా సబ్జెక్టుల్లో జూనియర్లను గుర్తించడంతో పాటు, కొరతవున్న పాఠశాలలకు సర్దుబాటు చేయడానికి ఖాళీల వివరాలతో ఈ నెల 9న మధ్యాహ్నం ఎంఈవోల లాగిన్‌లకు డేటాను విడుదల చేస్తారు. ఆ మరు సటి రోజే సంబంధిత సర్‌ప్లస్ టీచర్లను మండల కేంద్రానికి ఎంఈవోలు పిలిపించి స్థానికంగా సబ్జెక్టుల వారీగా కొరత వున్న పాఠశాలల జాబితాను ప్రదర్శించి వాటిలో వేకెన్సీని ఎంచుకోవడానికి అభీష్టాన్ని తీసుకుంటారు. ఇలా ఎంచుకున్న వేకెన్సీని ఆన్‌లైన్ విధానంలోనే అక్కడికక్కడే నమోదు చేస్తారు. సంబంధిత వేకెన్సీలో తాత్కాలిక నియామకం కింద ఆన్‌లైన్ ఉత్తర్వులను 11వ తేదీలోగా జారీచేస్తారు. ఇలా నియామకపు ఉత్తర్వులు పొందిన టీచర్లంతా 12వ తేదీన నూతన బదిలీస్థానాల్లో విధులు చేపట్టాల్సి ఉంటుంది. ఇదంతా ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా ప్రాతిపదికన జరుగు తుంది. వీరంతా ప్రస్తుత విద్యాసంవత్సరం ముగిసేవరకు అంటే వచ్చే ఏడాది ఏప్రిల్ 23 వరకు తాత్కాలిక స్థానాల్లోనే పనిచేయాల్సి ఉంటుంది. వర్క్ అడ్జస్ట్‌మెంట్ నుంచి అంధత్వం వున్న టీచర్లు (విజువల్లీ హ్యాండీ కాప్డ్), వచ్చే ఏడాది ఏప్రిల్ 31 నాటికి ఉద్యోగవిరమణ చేయనున్న ఉపాధ్యాయులను మినహాయించారు. వర్క్ అడ్జస్ట్‌మెంట్ పూర్తయిన అనంతరం మండలాల్లో ఇంకా మిగిలివున్న సర్‌ప్లస్ టీచర్లను డీవైఈవో పూల్‌కు చేర్చుతారు. సంబంధిత డివిజన్‌లో కొరత వున్న పాఠశాలలకు వారిని సర్దుబాటు చేసుకోవచ్చు. అక్కడకూడా మిగిలిపోతే డీఈవో పూల్‌కు చేర్చుతారు. మండలంలో టీచర్ల కొరతవున్న హైస్కూళ్ళకే వర్క్ అడ్జస్ట్‌మెంట్‌లో సర్దుబాటుకు తొలిప్రాధాన్యతనివ్వాలని నిర్దేశించారు. దీనికిగాను ఏ మండలంలోనైనా సబ్జెక్టు టీచర్లు దొరకకపోతే సర్‌ప్లస్‌గా వున్న ఎస్జీటీల పీజీ విద్యార్హతలను ప్రామాణికంగా తీసుకుని ఆయా సబ్జెక్టులకు ఉన్నత పాఠశాలల్లో నియమించేందుకు వెసులుబాటు కల్పించారు.

> ఉమ్మడి జిల్లాలో వర్క్ అడ్జస్ట్‌మెంట్ ఎలా జరిగే అవకాశం ఉందంటే.. ప్రతీ మండలంలో దాదాపు 30 నుంచి 40 మంది సర్‌ప్లస్ టీచర్లుండగా, అక్కడ గరిష్టంగా 16 నుంచి 18 మంది వరకే కొరత వున్నట్టు ప్రాథమికంగా తెలుస్తోంది. ఆ ప్రకారం చూస్తే సర్‌ప్లస్ టీచర్లంతా ఇంచు మించుగా ప్రస్తుతం పనిచేస్తున్న మండలాల్లోనే సర్దుబాటు అవుతారని అంచనా. మొత్తంమీద జీవో 117 ఉత్తర్వుల పేరు ప్రస్తావించక పోయినా వర్క్ అడ్జస్ట్‌మెంట్ అంతా ఆ ఉత్తర్వుల మార్గ దర్శకాలు, ఉపా ధ్యాయ, విద్యార్థుల సంఖ్య నిష్పత్తి ప్రకారమే జరుగుతోందని తెలుస్తోంది.

జాతీయ స్కాలర్‌షిప్ పరీక్షకు దరఖాస్తుల ఆహ్వానం

భీమవరం ఎడ్యుకేషన్, ఆగస్టు 7 : 2024-25 విద్యా సంవత్సరంలో జరుగుతున్న నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ పరీక్ష (ఎన్ఎంఎంఎస్) కొరకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 8వ తరగతి చదువుతున్న విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి జి.నాగమణి ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ, జిల్లా పరిషత్, మున్సిపల్, ఎయిడెడ్, మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలు, వసతి సౌకర్యం లేని ఆంధ్ర ప్రదేశ్ ఆదర్శ పాఠశాలలో 8వ తరగతి చదువుతూ కుటుంబ సంవత్సరాదాయం రూ.3,50,000 లోపు ఉన్న విద్యార్థులు మాత్రమే అర్హులు. ఈ పరీక్ష ఈ ఏడాది డిసెంబర్ 8న జరగనుందన్నారు. పరీక్ష రుసుం ఓసీ, బీసీ విద్యార్థులకు రూ.100, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు రూ.50 చెల్లించాలన్నారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునేందుకు సెప్టెంబరు 6, పరీక్ష రుసుం చెల్లించేందుకు సెప్టెంబరు 9 చివరి తేదీ అని అన్నారు. పరీక్ష రుసుం ఆన్‌లైన్ అప్లికేషన్‌లో ఇచ్చిన ఎస్‌బీఐ కలెక్ట్ లింక్ ద్వారా మాత్రమే చెల్లించాలన్నారు. పూర్తి వివరాలకు www.bse.ap.gov.in వెబ్‌సైట్‌లో లేదా సంబంధిత జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో తెలుసుకోవాలన్నారు.

నేడు సెట్‌వెల్‌లో జాబ్‌మేళా

ఏలూరుకార్పొరేషన్, ఆగస్టు 7 : జిల్లా ఉపాధి కల్పనా కార్యాలయం (నేషనల్ కెరీర్ సర్వీస్), ఏపీ ప్రభుత్వ యువజన సర్వీసుల శాఖ (సెట్‌వెల్) ఆధ్వర్యంలో ఈనెల 8వ తేదీ ఉదయం 10 గంటలకు కలెక్టరేట్ సెట్‌వెల్ కార్యాలయంలో జాబ్‌మేళా నిర్వహించనున్నట్టు జిల్లా ఉపాధి కల్పనా అధికారి సి.మధుభూషణరావు ఒక ప్రకటనలో తెలిపారు. జాబ్ మేళాలో హెటిరో డ్రగ్స్ భారత్ ఫైనాన్సియల్ ఇన్‌క్లూషన్ లిమిటెడ్ కంపెనీలు పాల్గొంటాయన్నారు. హెటిరో డ్రగ్స్‌లో జూనియర్ కెమిస్ట్‌లు, క్యూఎ/క్యూసి ట్రైనీలు, మెయింటినెన్స్ (పురుషులకు) పోస్టులకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తారన్నారు. జూనియర్ కెమిస్ట్ పోస్టులకు బీఎస్సీ కెమిస్ట్రీ, క్యూఎ/క్యూసి ట్రైనీల పోస్టులకు (ఎమ్మెస్సీ ఆర్గానిక్ కెమిస్ట్రీ అండ్ అనలి టికల్ ఇంటిగ్రేటెడ్) మెయింటినెన్స్ పోస్టులకు ఐటీఐ ఫిట్టర్ ఉత్తీర్ణులై, 18-26 సంవత్సరాలలోపు వయసు ఉండాలన్నారు. భారత్ ఫైనా న్షియల్ ఇన్‌క్లూషన్ లిమిటెడ్‌లో లోన్ ఆఫీసర్స్ పోస్టులకు ఇంటర్, డిగ్రీ, డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలన్నారు.ఈ పోస్టుకు 18-28 సంవత్సరాలు వయసు ఉండాలన్నారు. వివరాలకు 88868 82032 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

నేడు నూతన బస్సులు ప్రారంభించనున్న మంత్రి

ఏలూరు క్రైం, ఆగస్టు 7 : విజయవాడ జోన్ -2 ఆర్టీసీకి సంబంధించిన వివిధ జిల్లాలకు చెందిన కొత్త బస్సులను ఏలూరు ఆర్టీసీ డిపో గ్యారేజీలో గురువారం ఉదయం రాష్ట్ర రవాణాశాఖ, యువజన క్రీడల శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి ప్రారంభించనున్నారు. ఏలూరు ఎమ్మెల్యే బడేటి రాధాకృష్ణయ్య, దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్, మంత్రులు, ఎమ్మెల్యేలు, విజయవాడ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ గోపీనాథ్‌రెడ్డి, ఏలూరు జిల్లా ప్రజా రవాణాశాఖాధికారి వరప్రసాద్ పాల్గొననున్నారు.

సైబర్ నేరగాళ్ల వలలో రైతు

సాగు పెట్టుబడి కోసం ఉంచుకున్న రూ.38,500 మాయం

కాళ్ళ, ఆగస్టు 7: ప్రభుత్వాలు, అధికార యంత్రాంగం సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలని హెచ్చరిస్తున్నా ఎక్కడో ఒకచోట అమాయకులు చిక్కుకుంటున్నారు. ఇటువంటి సంఘటనే కాళ్ళ మండలంలో చోటు చేసుకుంది. డబ్బులు పోగొట్టుకున్న బాధితుడు లబోదిబో మంటూ పోలీస్ స్టేషన్ చుట్టూ తిరుగుతున్నాడు. వివరాల్లోకి వెళితే కాళ్ళ మండలం కోమటిగుంట గ్రామానికి చెందిన యలమంచిలి బాబ్జి వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. అతనికి ఉండి మండలం పెదపుల్లేరు గ్రామంలోని యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్యాంక్‌లో సేవింగ్ అకౌంట్ ఉంది. బాబ్జికి ఈనెల 1వ తేదీ మధ్యాహ్నం 3 గంటల సమయంలో తన మొబైల్ ఫోన్‌కి ఓటీపీ మేసేజ్‌లు వచ్చాయి. ఓపెన్ చేసి చూస్తుండగా తన బ్యాంక్ అకౌంట్ నుంచి వరుసగా 7 సార్లు 5 వేలు, ఒకసారి 3,500 చొప్పున మొత్తం రూ.38,500 కట్ అయ్యాయి. బ్యాంక్ యాప్‌లో చూసుకోగా వినీష్ కుమార్ అనే వ్యక్తికి నగదు బదిలీ అయినట్లు గమనించిన వెంటనే 1930 నెంబర్‌కి ఫోన్ చేసి సైబర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అనంతరం బ్యాంక్‌కు వెళ్ళి అకౌంట్ ఫ్రీజ్ చేయించాడు. ఈనెల రెండో తేదీన సైబర్ క్రైమ్ నుంచి స్థానిక పోలీస్‌స్టేషన్‌లో కంప్లైయింట్ చేయాలని సూచిస్తూ మేసేజ్ రావడంతో కాళ్ళ పోలీస్ స్టేషన్‌కి వచ్చినట్టు ఆయన తెలిపారు. అప్పటి నుంచి రోజూ పోలీస్‌స్టేషన్ చేట్టూ తిరుగుతూనే ఉన్నానని తెలిపారు. వ్యవసాయానికి పెట్టుబడి కోసం తన ఖాతాలో దాచుకున్న డబ్బులు సైబర్ నేరగాళ్ళు దోచుకున్నారని వాపోయాడు.



పోలీసుస్టేషన్ వద్ద బాధిత రైతు





శ్రీవారి సేవలో తెలంగాణ ఈసీ పార్థసారథి

ద్వారకాతిరుమల, ఆగస్టు 7: ద్వారకాతిరుమల చిన్నతిరు మలేశుని ఆలయాన్ని తెలంగా ణ ఎన్నికల కమిషనర్ పార్థసారథి బుధవారం సందర్శించారు. ఆలయానికి కుటుంబసమేతంగా విచ్చేసిన ఆయనకు ఆలయ అధికారులు, అర్చకులు ఆలయ మర్యాదలతో ఘనస్వాగతం పలికారు. స్వామి, అమ్మవార్లను దర్శించి ప్రత్యేక పూజలు జరుపుకున్నారు. అర్చకులు స్వామివారి శేషవ స్త్రాన్ని కప్పి వేదాశీర్వచనం అందించారు. డిప్యూటీ ఈవో బాబూరావు,ఏఈవో మెట్టపల్లి దుర్గారావులు ఆయనకు స్వామి, అమ్మవార్ల చిత్రపటం, ప్రసాదాలను అందజేశారు.

మద్యం మత్తులో విద్యుత్ స్తంభం ఎక్కి..



భీమవరం క్రైం, ఆగస్టు 7 : భీమవరం ఒకటవ పట్టణ పోలీస్‌స్టేషన్ పక్కన ఉన్న విద్యుత్ సబ్ స్టేషన్‌లో విద్యుత్ స్తంభం ఎక్కి ఒక వ్యక్తి బుధ వారం హల్‌చల్ చేశాడు. పట్టణానికి చెందిన మతి స్థిమితం లేని వ్యక్తి మద్యం మత్తులో హల్‌చల్ చేశాడు. ఒంటిపై లుంగీతో విద్యుత్ స్తంభంపైకి ఎక్కి " తన వస్తువులు తనకు ఇవ్వాలని తన సెల్ ఫోన్, డబ్బులు ఎవరో తీసుకున్నారని అవి తెచ్చి వ్వాలంటూ " కేకలు వేయిడంతో పక్కనే ఉన్న పోలీసులు అక్కడకు చేరుకుని అతన్ని బుజ్జగించి కిందకు దింపారు. కౌన్సెలింగ్ ఇచ్చి పంపించివేశారు.

విద్యుదాఘాతంతో ఆవు మృతి

ద్వారకాతిరుమల, ఆగస్టు 7: మండలంలోని ఐఎస్ జగన్నాధపురం శివారు రామానుజపురంలో బుధవారం విద్యుదాఘాతంతో ఓ ఆవు మృతి చెందింది. గ్రామానికి చెందిన పెంటయ్య పశువులు మేపుకుంటూ కుటుంబపోషణ జరుపుకుంటాడు. తన పశువులను గ్రామంలోని పొలాల్లోకి మేతకు తీసుకుళ్లాడు. ఆవు మేస్తూ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఉన్న ప్రాంతానికి వెళ్లింది. ప్రమాదవశాత్తు ట్రాన్స్‌ఫార్మర్‌కు తగలడంతో షాక్ కొట్టి అక్కడికక్కడే మృతి చెందింది.



ప్రమాదానికి కారణమైన వాహనం.. మృతి చెందిన మహిళ

కారు..బీభత్సం

మహిళ మృతి.. నలుగురికి గాయాలు

ఐదు బైక్‌లు నుజ్జు నుజ్జు

నరసాపురం ఆగస్టు 7: పట్టణంలో బుధవారం ఒక కారు బీభత్సం సృష్టించింది. రోడ్డు క్రాస్ చేసి బైక్‌ను ఢీకొట్టింది. అంతటితో ఆగలేదు.. మొగల్తూరు రోడ్‌లోని అంజనేస్వామి గుడి వద్ద నాలుగు బైక్‌ల మీద నుంచి దూసుకుపోయింది. ఈ సంఘటనలో మండలంలోని మంగళ గుంటపాలెంకు చెందిన మేరీబాయి (50) మృతి చెందగా బైక్ నడుపుతున్న యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. ఇతడిని ఆస్పత్రికి తరలించారు. నాలుగు బైక్‌లు నుజ్జు నుజ్జు అయ్యాయి. పెద్దిరెడ్డి ఏసు, అరుణ, సాయి మణికంట, ఆలివర్‌లకు గాయాలయ్యాయి. ఈ సంఘటన మొగల్తూరు రోడ్‌లో భయానక వాతావరణాన్ని సృష్టిం చింది. మండలానికి చెందిన మేరీబాయి ఆమె మేనల్లుడు మార్కెట్ నుంచి మంగళగుంటపాలెం వెళ్లుతున్నారు.. ఆ సమయంలో మొగల్తూరు నుంచి వేగంగా వస్తున్న కారు బైక్‌ను ఢీకొట్టింది. సంఘటన స్థలంలోనే మేరీబాయి మృతి చెందింది. బైక్ నడుపుతున్న యువకుడికి తీవ్ర గాయా లయ్యాయి. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ యాదగిరి చెప్పారు. అతివేగం వల్ల కంట్రోల్ చేయలేకపోవడంతో ఈ ప్రమాదం జరి గిందని చెబుతున్నారు. చనిపోయిన మహిళకు, గాయపడిన యువ కుడికి, ధ్వంసమైన వాహనదారులకు న్యాయం చేయాలంటూ సంఘటన స్థలం వద్ద ఆందోళనకు దిగారు. ఎమ్మెల్యే నాయకర్ సంఘటన స్థలానికి చేరుకుని వారితో మాట్లాడారు. దీంతో భారీగా ట్రాఫిక్ జామ్ అయింది.

విద్యుదాఘాతంతో యువకుడి దుర్మరణం

ఏలూరు క్రైం, ఆగస్టు 7 : ఇంటి వద్ద మోటారు వేయిస్తున్న ఒక యువకుడికి విద్యుత్ షాక్ తగలడంతో మృత్యువాత పడ్డాడు. ఏలూరులోని వంగాయిగూడెం ఆంజనేయస్వామి గుడి ప్రాంతానికి చెందిన దాసరి అశోక్ కుమార్ (36) ఏలూరు మున్సిపల్ కార్పొరేషన్‌లో రెవెన్యూ సెక్షన్‌లో ఔట్ సోర్సింగ్ హెల్పర్‌గా పనిచేస్తున్నాడు. బుధవారం ఉదయం తన ఇంటి వద్ద వాటర్ మోటర్ ఆన్ చేయడానికి వెళ్లగా షాక్‌కు గురయ్యాడు. అతనిని ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తీసుకువచ్చారు. అప్పటికే మృతి చెందాడని వైద్యులు నిర్ధారించారు. సీఐ రాజశేఖర్ ఆధ్వర్యంలో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కొమ్ముచిక్కాలలో యువకుడు..

పోడూరు, ఆగస్టు, 7 : పోడూరు మండలం కొమ్ముచిక్కాలలో ఒక యువకుడు ప్రమాదవశాత్తు విద్యుదాఘాతంతో మృతి చెందాడు. గ్రామంలోని పెదపేటకు చెందిన ఈతకోట సురేష్ (23) మంగళవారం రాత్రి డాబా పైకి వెళ్లాడు. డాబా శ్లాబ్‌పై నాచు ఉండటంతో వర్షం చినుకులకు కాలు జారి ఆ డాబాకు సమీపంలో ఉన్న విద్యుత్ వైర్లు కాలికి తగిలి షాక్ కొట్టడంతో డాబా పైనుంచి కిందకు పడిపోయాడు. పాలకొల్లు ప్రభు త్వాసు పత్రికి తరలించగా అప్పటికే అతను మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. మృతుడు సురేష్‌కు ఏడాదిన్నర క్రితం వివాహం జరిగింది. అతని భార్య ప్రస్తుతం గర్భవతి. ఎస్ఐ డి.రామ్‌కుమార్ కేసు నమోదు చేసి దరాప్తు చేస్తున్నారు.

చికిత్స పొందుతూ ఒకరి మృతి

ఏలూరు క్రైం, ఆగస్టు 7 : పురుగుమందుతాగి తీవ్ర అస్వస్థతకు గురై గుంటూరు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్న ఒక వ్యక్తి మృతి చెందాడు. ఏలూరు గొల్లాయిగూడెం కాలనీకి చెందిన పుట్టా నాగరాజు (50)కు భార్య, ముగ్గురు కుమారులు ఉన్నారు. కుటుంబ కలహాల నేపథ్యంలో ఈనెల 5వ తేదీ ఉదయం నాగరాజు పురుగుమందు తాగాడు. అతనిని ఏలూరులోని ఒక ప్రైవేటు ఆసుపత్రికి తీసుకువెళ్ళగా మెరుగైన చికిత్స కోసం గుంటూరు ప్రభుత్వాసుపత్రికి తీసుకువెళ్ళారు. అక్కడ చికిత్స

క్రైం కార్నర్

పొందుతున్న అతను బుధవారం రాత్రి మృతి చెందాడు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

ఏలూరు క్రైం, ఆగస్టు 7 : జాతీయ రహదారిపై ఎలాంటి జాగ్రత్తలు లేకుండా లారీ పార్కింగ్ చేయడంతో అతి వేగంగా వెళ్తున్న మోటారు సైకిల్ ఢీ కొనడంతో నలుగురు తీవ్ర గాయాలకు గురయ్యారు. ప్రమాదం జరిగిన రోజు భర్త మరణించగా, ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న భార్య బుధవారం మృతి చెందింది. విజయవాడనకు చెందిన నిర్మల్‌నాయక్ (40) అతని భార్య పింకి నాయక్ (35), కుమార్తె స్విష్టి, నిర్మల్‌నాయక్ సోదరుడు మౌలాలీ నాయక్‌లు కలిసి మోటారు సైకిల్‌పై ఈనెల 4వ తేదీన ద్వారకా తిరు మలలోని స్వామి దర్శనానికి వెళ్ళారు. తిరిగి వస్తుండగా ఏలూరు సమీపంలోని మెయిన్‌బైపాస్ మదీనా హోటల్ ఎదురుగా ఆగి ఉన్న లారీని ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో వీరంతా తీవ్ర గాయాలకు గురవగా విజయవాడ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతున్న నిర్మల్‌నాయక్ 5వ తేదీన మృతి చెందగా పింకినాయక్ బుధవారం మృతి చెందింది. దీంతో ఈ ప్రమాదంలో ఇద్దరు మరణించారు. ఏలూరు రూరల్ ఎస్ఐ కె.రాజారెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడి మృతి

లింగపాలెం, ఆగస్టు 7: రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి చెందాడు. లింగపాలెం మండలం మటంగూడెం గ్రామానికి చెందిన శీకాకొల్లు ఆనందరావు (35) మటంగూడెం నుంచి ధర్మాజీగూడెం వైపు వస్తుండగా హోలీ ట్రినిటీ పాఠశాల వద్ద కుక్క అడ్డురావడంతో అదుపుతప్పి పడిపోయాడు. తీవ్రగాయాలవడంతో చికిత్స నిమిత్తం ఏలూరు ఆసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్స నిమిత్తం విజయవాడలోని ఆసుపత్రికి తీసుకువెళ్లగా చికిత్సపొందుతూ మంగళవారం రాత్రి మరణించినట్లు పోలీసులు తెలిపారు. భార్యలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చెన్నారావు తెలిపారు. మృతునికి భార్య, పిల్లలు ఉన్నారు.

రామానుజపురంలో మహిళ దారుణహత్య



హత్యకు గురైన సాయిలక్ష్మి..పిల్లలతో(ఫైల్)



కొయ్యలగూడెం, ఆగస్టు 7: మండలంలోని రామా నుజపురంలో ఒక మహిళ హత్యకు గురైంది. సీఐ మధుబాబు తెలిపిన వివరాల ప్రకారం రామానుజపురం గ్రామానికి చెందిన రాజనాల సూర్య చంద్రానికి తడికల పూడికి చెందిన సాయిలక్ష్మికి (35) పదేళ్ల క్రితం వివాహమైంది. అయితే కొంత కాలంగా భార్యభర్తలు గొడవ పడుతున్నారు. గ్రామంలోని పెద్దలు పలు మార్లు సర్దుబాటు చేశారు. ఈ గొడవల నేపథ్యంలో భర్త బుధవారం మధ్యాహ్నం భార్యను కత్తితో అతికిరాతకంగా మెడపై నరి కాడు.దీంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. పట్టపగలే ఈ దారుణం జరగటంతో గ్రామస్థులంతా ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. వీరికి ఇద్దరు పిల్లలు కూడా ఉన్నారు. సంఘటన స్థలానికి డీఎస్పీ సురేష్‌కుమార్ రెడ్డి, సీఐ మధుబాబు చేరుకుని వివరాలు సేకరించారు. భర్తను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని ఒకరి మృతి

న్యాయం చేయాలని డిపో ఎదుట బంధువుల ధర్నా



డిపో ఎదుట ఆందోళన

జంగారెడ్డిగూడెం,ఆగస్టు 7 : మండలంలోని గురవాయిగూడెంలో బుధ వారం ఆర్టీసి బస్సు ఢీకొని వాసమాల నరేంద్ర (30) మృతి చెందాడు. దీంతో మృతుని బంధువులు ఆర్టీసి డిపో ఎదుట ధర్నా నిర్వహించారు. నరేంద్ర మండలంలోని నాగులగూడెం గ్రామంలో వ్యవసాయం చేస్తూ జీవిస్తున్నాడు. అతని భార్య ఆమె పుట్టిల్లు ద్వారకా తిరుమల మండలం కోడిగూడెం వెళ్ళింది.నరేంద్ర బుధవారం తన భార్య దగ్గరకు వెళ్లి తిరిగి వస్తుండగా గురవాయిగూడెం వద్ద జంగారెడ్డిగూడెం నుంచి ఏలూరు వెళ్తున్న ఆర్టీసి బస్సు ఢీకొట్టడంతో తీవ్రగాయాలయ్యాయి. జంగారెడ్డిగూడెంలోని ఒక ప్రైవేటు ఆసుపత్రికి తీసుకువెళ్లగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. న్యాయం చేయాలంటూ బంధువులు జడ్పీటీసీ బాబ్జీ ఆధ్వర్యంలో ఆర్టీసీ డిపో ఎదు రుగా ధర్నా చేపట్టారు. ఆర్టీసీ డీఎం, గంగాధరరావు, సీఐ రాజేష్ నిరసన కారుల దగ్గరకు వచ్చి ప్రభుత్వం నుంచి పరిహారం వచ్చేలా చూస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.



వివరాలు తెలుపుతున్న ఎస్పీ కిశోర్.. అరెస్టు అయిన నిందితుడు

బాలికపై అత్యాచారం కేసులో నిందితుడి అరెస్టు

గతంలోనూ పోక్సో కేసు.. బెయిల్‌పై ఉండగా ఘాతుకం

ఏలూరు క్రైం, ఆగస్టు 7 : కుటుంబ సభ్యుల మధ్యలో పడుకున్న బాలికను అపహరించుకుపోయి అత్యాచారానికి పాల్పడిన వ్యక్తిని అరెస్టు చేసినట్టు జిల్లా ఎస్పీ కిశోర్ చెప్పారు. ఏలూరు జిల్లా పోలీస్ కార్యాలయంలో బుధవారం విలేకరుల సమావేశంలో కేసు వివరాలను వెల్లడించారు. నూజివీడు రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఒక గ్రామంలో కుటుంబ సభ్యుల మధ్యలో పడుకున్న ఐదేళ్ల బాలికను నాల్గో తేదీ అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తి అపహరించుకుపోయి అత్యా చారానికి పాల్పడ్డాడు. అర్ధరాత్రి రెండున్నర గంటల సమయంలో అటుగా వెళ్తున్న రైతు బాలికను గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చాడు. నైట్‌బీటు పోలీసులు అక్కడకు చేరుకుని గాయాలతో ఉన్న బాలికను తొలుత నూజివీడు ప్రభుత్వాసుపత్రి అనంతరం విజయవాడ ఆసుపత్రికి తరలించారు. బాలిక నుంచి నేరస్తుడి ఆనవాళ్లను అడిగి తెలుసుకున్నామన్నారు. శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానాన్ని కూడా వినియోగించినట్టు చెప్పారు. డాగ్ స్క్వాడ్‌లు, క్లూస్ టీమ్‌లను కూడా రంగంలోకి దించి ఆధారాలు సేకరించామన్నారు. నిందితుడు గుంటూరు, పల్నాడు జిల్లాల వైపు ప్రయాణిస్తున్నాడని సమాచారం ఉండడంతో అక్కడ అధికారులతో మాట్లాడి పల్నాడు జిల్లా రెంటచింతల మండలం కుమ్మరికోట గ్రామానికి చెందిన నేరస్తుడిని అరెస్టు చేశామన్నారు. రెంటచింతలకు చెందిన మిరియాల జయరావు (33) గతంలో ఆ జిల్లా పరిధిలోని ఏడు సంవత్సరాల బాలికపై అత్యాచారానికి పాల్పడగా అతనిపై పోక్సో కేసు నమోదు చేసి అరెస్టు చేశారన్నారు. బెయిల్‌పై బయటకు వచ్చిన అతను ప్రస్తుతం లారీ క్లీనర్‌గా పనిచేస్తున్నాడన్నారు. నూజివీడుకు లారీ కిరాయి నిమిత్తం వచ్చిన అతను ఈ ఘాతుకానికి పాల్పడ్డాడని ఎస్పీ చెప్పారు. గతంలో అతను పొందిన బెయిల్ కూడా రద్దు చేయిస్తామన్నారు. ఫాస్ట్ ట్రాక్ కోర్టు ద్వారా కేసు విచారణ జరిపి అతనికి శిక్ష పడేలా అన్ని చర్యలు తీసుకుంటున్నామన్నారు. కేసులో చాకచక్యంగా వ్యవహరించిన ఏలూరు డీఎస్పీ ఈ శ్రీనివాసులు, నూజివీడు సీఐ రామకృష్ణ, భీమడోలు సీఐ రవికుమార్, నిడమర్రు సీఐ శుభాష్, ఏలూరు టూటౌన్ సీఐ ప్రభాకర్, ఎస్ఐలను ఎస్పీ అభినందించారు. ఎస్పీతో పాటు అదనపు ఎస్పీ స్వరూపరాణి, ఏలూరు నుంచి బదిలీ అయిన డీఎస్పీ శ్రీనివాస్ పాల్గొన్నారు.

మద్యానికి బానిసై ఆత్మహత్య

భీమవరం క్రైం, ఆగస్టు 7 : భీమవరం రెండవ పట్టణం 31వ వార్డులో ఒక వ్యక్తి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్టు భీమవరం రెండవ పట్టణ ఎస్ఐ రెహ్మాన్ తెలిపారు. విజయనగరానికి చెందిన సాజుబిల్లి పాపియ్య (56) ప్రస్తుతం భీమవరంలో ఉంటున్నారు. గతంలో అక్కడ జరిగిన ఒక హత్య కేసులో పదేళ్ళు జైలు శిక్ష అనుభవించి జైలులో సత్ప్రవర్తన కారణంగా 2021 సంవత్సరంలో విడుదలయ్యారు. భీమవరంలో ఉంటున్న భార్య కుమారుడు దగ్గరకు చేరుకున్నా ఒంటరిగా వేరొక చోట ఉంటున్నాడు. మద్యానికి బానిస కావడంతో పాటు అధికంగా మద్యం తాగి ఉరి వేసుకుని ఉండవచ్చని పోలీసులు భావిస్తున్నారు.అతని కుమారుడు చిన్నం నాయుడు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

పాలిటెక్నిక్‌లో చేరేందుకు అవగాహన కల్పించాలి

» కలెక్టర్ నాగరాణి ఆదేశం

భీమవరంటౌన్, ఆగస్టు 7 : జిల్లాలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలల్లో చేరికలకు విద్యార్థులలో విస్తృత అవగాహన కల్పించాలని కలెక్టర్ చదలవాడ నాగరాణి ఆదేశించారు. బుధవారం స్థానిక కలెక్టర్ ఛాంబర్‌లో ఆమె తాడేపల్లి గూడెం పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు, విద్యాశాఖ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ పాలిటెక్నిక్‌లో సివిల్ బ్రాంచి విద్య ద్వారా టాటా, ఎల్‌అండ్‌టీ, మెగా వంటి సంస్థలలో మంచి వేతనంతో అవకాశాలు మెండుగా ఉన్నాయన్నారు. విద్యాశాఖ అధికారులతో సమన్వయం చేసుకుని రానున్న పది రోజుల్లో పాలిటెక్నిక్ కళాశాలలో చేరికలను పెంచేందుకు కార్యాచరణ రూపొందించుకుని అమలు చేయాలన్నారు. తాడేపల్లిగూడెం పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ ఫణీంద్ర ప్రసాద్, మెకానికల్ బ్రాంచి హెడ్ శివప్రసాద్, సివిల్ బ్రాంచ్ హెడ్, ఎస్ఎస్ఏ పీవో పి. శ్యాంసుందర్, డీఈవో ఆఫీస్ ఏడి ఎస్.సత్యనారాయణ పాల్గొన్నారు.

బిందు, తుంపర్ల సేద్యానికి రాయితీపై పరికరాలు..

బిందు, తుంపర్ల సేద్యానికి రాయితీపై పరికరాలు పొందేందుకు ఆసక్తి గల రైతులు రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని కలెక్టర్ నాగరాణి కోరారు. బుధవారం ఆమె మాట్లాడుతూ ఈ పథకం కింద ప్రభుత్వం అన్ని రకాల పండ్లు, కూరగాయలు, పూల తోటలకు రాయితీపై సేద్య పరికరాలను అందిస్తుందన్నారు. జిల్లాకు 2023-24 సంవత్సరానికి 500 హెక్టార్లు లక్ష్యంగా నిర్దేశించామన్నారు. ఐదు ఎకరాల లోపు ఉన్న సన్న, చిన్నకారు రైతులకు 90 శాతం సబ్సిడీపై, 5 ఎకరాల నుంచి 12.5 ఎకరాల లోపు కలిగిన రైతులకు 50శాతం సబ్సిడీపై పరికరాలను అందిస్తామన్నారు. రైతులు ఆధార్ కార్డు, భూ యాజమాన్య పత్రం, బ్యాంకు ఖాతా, ఫొటోలు తీసుకుని దగ్గరలోని ఆర్‌బీకేల్లో ఉన్న గ్రామ ఉద్యాన సహాయకులు, వ్యవసాయ సహాయకులకు సమర్పించాలన్నారు.

శ్రీవారి దేవస్థానానికి రూ.5 లక్షల విరాళం



దేవస్థానం కమిటీకి నగదు అందిస్తున్న కాపు వనితా క్లబ్ అధ్యక్షురాలు అల్లం వాణి

భీమవరంటౌన్, ఆగస్టు 7 : హౌసింగ్ బోర్డ్ కాలనీలోని శ్రీపద్మావతి సమేత వేంకటేశ్వరస్వామి దేవస్థానంకు యునైటెడ్ కాపు వనితా క్లబ్ ఇంటర్నేషనల్ భీమవరం శాఖ క్లబ్ ప్రెసిడెంట్ అల్లం వాణి వనితా క్లబ్ తరపున దేవస్థానం ఏసీ ఫంక్షన్ హాలుకు నూతనంగా నిర్మించే లిఫ్ట్ నిమిత్తం రూ.5 లక్షలను విరాళంగా అందించారు. కమిటీ సభ్యులు స్వామిని దర్శించుకోగా ఆలయ అర్చకుడు శ్రీనివాసాచార్యులు పూజలు చేసి ఆశీర్వచనాలు అందించారు. ఆలయ అధ్యక్షుడు కంతేటి వెంకట్రాజు, కాలనీ అధ్యక్షుడు ఎస్. రామారావు, కార్యదర్శి కె.బాల, సభ్యులు మధుసూదన్, బంగార్రాజు. మారిశెట్టి రాంప్రసాద్, అప్పారావు, ట్రెజరర్ రజిని, క్లబ్ మాజీ ప్రెసిడెంట్ రూపవాణి, సభ్యులు వనజాక్షి సుభద్ర, కుమారి, భవ్యశ్రీ, సంధ్యారాణి, పద్మ పాల్గొన్నారు.

'ఏఎస్ఎన్ఎం'లో అధ్యాపక పోస్టులకు ఆహ్వానం

పాలకొల్లు అర్బన్, ఆగస్టు 7 : ఏఎస్ఎన్ఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అధ్యాపక పోస్టులకు దరఖాస్తులు చేసుకోవాలని ప్రిన్సిపాల్ డాక్టర్ టి.రాజరాజేశ్వరి బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. కంప్యూటర్ సైన్స్, తెలుగు, ఆక్వా కల్చర్ సబ్జెక్టుల్లో అతిథి అధ్యాపకులు పోస్టులకు పీజీలో 55 శాతం లేదా అపైన మార్కులు కలిగిన వారు అర్హులన్నారు. సర్టిఫికెట్లు, దరఖాస్తులను ఈనెల 17వ తేదీ లోపుగా కళాశాల కార్యాలయంలో లేదా మెయిల్ ద్వారా పంపించవచ్చన్నారు. ఈనెల 20న ఉదయం పది గంటలకు ఇంటర్వ్యూకు హాజరు కావాలన్నారు. వివరాలకు టి.కృష్ణ 70136 29841 నంబరులో సంప్రదించాలన్నారు.

లోక్ అదాలత్‌ను వినియోగించుకోవాలి

తణుకు, ఆగస్టు 7: జాతీయ లోక్ అదాలత్‌లో కేసులు రాజీ చేసుకోవాలని నాల్గో అదనపు జిల్లా న్యాయాధికారి డి.సత్యవతి అన్నారు. బుధవారం కోర్టు ప్రాంగణంలో పోలీసు అధికారులు, న్యాయవాదులతో సమావేశం నిర్వహించి మాట్లాడుతూ వచ్చే నెల 14న లోక్ అదాలత్‌పై అవగాహన కల్పించాలన్నారు. సమావేశంలో న్యాయమూర్తులు కె.కృష్ణ సత్యలత, పి.సాయిరామ్, వీవీ రంజిత్‌కుమార్, ఎ.వి. నాగరాజు, ఎస్.చిరంజీవిరావు, తాడి ఆంజనేయులు, పీపీ హనుమంతరావు, సీఐ నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సొంత ఖర్చులతో ర్యాంపు ఏర్పాటు



పైడిపర్రు వైపు ర్యాంపు నిర్మాణం

తణుకు, ఆగస్టు 7: పట్టణ పరిధిలోని 32వ వార్డు రైల్వే స్టేషన్ రోడ్డు (పైడిపర్రు) వైపు కొత్తగా సిమెంటు రహదారి వేశారు. అయితే దానికి ఇరువైపులా ర్యాంపులు వేయలేదు. దీంతో కొద్ది నెలలుగా స్థానికులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నా పట్టించుకోలేదు. అయితే ఆ వార్డులో నివాసం ఉంటున్న మాజీ కౌన్సిలర్ తాడిపర్తి శ్యాంబాబు సొంత ఖర్చులతో ర్యాంపు వేయించడంతో వాహనదారుల కష్టాలు తీరాయి.

కలెక్టర్‌ను కలసిన ఉద్యోగ సంఘ నాయకులు



భీమవరంటౌన్. ఆగస్టు 7 : కలెక్టరు చదలవాడ నాగరాణిని ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా యూనిట్ బృందం మర్యాద పూర్వకంగా బుధవారం కలిసి పుష్పగుచ్ఛం అందించారు. ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలపై కలెక్టరుకు వినతి పత్రం అందించారు.

విద్యార్థులకు బస్ పాస్‌ల వితరణ

ఇరగవరం, ఆగస్టు 7 : రేలంగి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని 131 మంది విద్యార్థులకు గ్రామ జనసేన నాయకుల ఆర్థిక సాయంతో తణుకు డిపో ఉచిత బస్సుపాస్‌లను బుధవారం పంపిణీ చేసింది. హెచ్ఎం తిర్రే రవీంద్ర, డిపో ఉద్యోగి వెంకటరత్నం, జనసేన గ్రామ అధ్యక్షుడు పసుపులేటి సత్యనారాయణ, ఉపాధ్యక్షుడు మంగిన శ్రీనివాసరావు, ఇరగవరం మండల జనసేన ప్రధాన కార్యదర్శి తోట మణికంఠ కుమార్, పసుపులేటి గణేష్ పాల్గొన్నారు.

'తల్లిపాలు బిడ్డకు ఆరోగ్యకరం'

నరసాపురం టౌన్/అత్తిలి/మొగల్తూరు/పెనుగొండ, ఆగస్టు 7: తల్లిపాలు బిడ్డకు ఆరోగ్యకరమని చైర్‌పర్సన్ వెంకటరమణ అన్నారు. బుధవారం నరసాపురంలోని లయన్స్ క్లబ్ భవనంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన తల్లిపాల వారోత్సవాల అవగాహన సదస్సుకు ఆమె ముఖ్యఅతిథిగా విచ్చేశారు. ఎమ్మెల్యే సతీమణి బొమ్మిడి సునీత కార్యక్రమంలో పాల్గొని సీమంతాలు నిర్వహించారు. అనంతరం పట్టణంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. అత్తిలి మండలం మంచిలిలో పీహెచ్‌సీ హెల్త్ సూపర్‌వైజర్ పి.శూశన్ ఆధ్వర్యంలో ఆరవల్లి అంగన్‌వాడీ కేంద్రాల ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించి అవగాహన కల్పించారు. మొగల్తూరు మండలం గోడావారిపేటలో మొగల్తూరు కమ్యూనిటీ హెల్త్ అధికారి ఎం.విరాజిత ఆధ్వర్యంలో తల్లిపాలన అవగాహన ర్యాలీ నిర్వహించారు. పెనుగొండ మండలం వడలి గ్రామంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రూతు కుమారి ఆధ్వర్యంలో గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు.

సంక్షిప్త సమాచారం..

- **పాలకొల్లు అర్బన్, ఆగస్టు 7 :** కేరళ రాష్ట్రంలో వరద బాధితుల కోసం సీపీఎం నాయకులు బుధవారం పట్టణంలో రూ.4,600 విరాళాలు సేకరించామని సీపీఎం కార్యదర్శి జవ్వాది శ్రీనివాసరావు తెలిపారు.
- **పెనుగొండ :** ప్రతిరోజూ వర్షాలు కురుస్తున్నందున వర్షపునీరు నిల్వ లేకుండా గ్రామాలను పరిశుభ్రంగా ఉంచాలని ఎంపీడీవో కార్యాలయం వద్ద సమావేశంలో ఎంపీడీవో శ్రీనివాస దొర సూచించారు.
- **ఆచంట :** అన్నిగ్రామాల్లో నిరంతరం శానిటేషన్ పనులు, పారిశుధ్య పనులు చేపట్టి గ్రామాలను పరిశుభ్రంగా ఉంచాలని బుధవారం ఎంపీడీవో కార్యాలయం సమావేశంలో ఎంపీడీవో పి.నరసింహప్రసాద్ తెలిపారు.
- **పెంటపాడు:** ప్రత్తిపాడులో రహదారికిరు వైపులా పెరిగిన పిచ్చి మొక్కలను ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ ఆదేశాల మేరకు బుధవారం ఎక్స్‌కవేటర్‌తో తొలగించారు. స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.
- **ఉండి :** కొత్తగా కోళ్ల పెంపకం చేపట్టాల్సిన వారు తొలుత తక్కువ సంఖ్యలో కోళ్లను తెచ్చుకుని పెంపకంపై అవగాహన పెంచుకోవాలని బుధవారం ఎన్ఆర్‌పీ అగ్రహారం కేవీకేలో పెరటి కోళ్ల పెంపకంపై రెండోరోజు శిక్షణ కార్యక్రమంలో విస్సాకోడేరు వెటర్నరీ డాక్టరు టి.హేమ తెలిపారు.

ముస్తాబవుతున్న అన్న క్యాంటీన్

15న ప్రారంభించేందుకు ఏర్పాట్లు



తణుకు సొసైటీ రోడ్డులో ప్రారంభానికి సిద్ధమవుతున్న అన్న క్యాంటీన్

తణుకు, ఆగస్టు 7: పేదల ఆకలి తీర్చే అన్న క్యాంటీన్‌ను కూటమి ప్రభుత్వం పునఃప్రారంభించనుంది. ఈ మేరకు తణుకులోని అన్న క్యాంటీన్ వద్ద యుద్ధప్రాతిపదికన పనులు చేస్తున్నారు. గతంలో టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు అన్న క్యాంటీన్ల వద్ద రూ. 5కే ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం భోజనం అందించి పేదల ఆకలి తీర్చేవారు. అయితే వైసీపీ ప్రభుత్వం అన్న క్యాంటీన్లను మూసివేయించింది. అప్పటి నుంచి ఆయా భవనాలు మూతపడి పిచ్చిమొక్కలతో నిండి, శిథిలావస్థకు చేరాయి. ఇపుడు కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో అన్నక్యాంటీన్‌లను పునఃప్రారంభిస్తోంది. ఇందులో భాగంగా భవనానికి మరమ్మతులు చేశారు. ఈనెల 15న ప్రారంభించే విధంగా ఏర్పాట్లు సాగుతున్నాయి.



పేదల ఆకలి తీర్చడమే లక్ష్యం : ఆరిమిల్లి రాధాకృష్ణ, ఎమ్మెల్యే, తణుకు

పేదల ఆకలి తీర్చడమే కూటమి ప్రభుత్వ లక్ష్యం. గతంలో టీడీపీ హయాంలో అన్న క్యాంటీన్లను ప్రారంభించి రూ. 5కే పేదల కడుపు నింపింది. ఎంతోమంది ఆస్పత్రులకు, పనుల కోసం వచ్చిన వారికి అతి తక్కువ ధరకు భోజనం పెట్టి పేదలకు ఆర్థిక భారం లేకుండా చేసింది. త్వరలోనే క్యాంటీన్ ప్రారంభిస్తాం.







పాలకొల్లు సభలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ అంగర రామ్మోహన్, పెనుగొండ.. నరసాపురంలలో చేనేత కార్మికులకు సత్కారం

చేనేత కార్మికుల అభ్యున్నతికి టీడీపీ కృషి : అంగర

పాలకొల్లు టౌన్, ఆగస్టు 7 : 'చేనేత కార్మికుల అభ్యున్నతికి మొదట్నించీ టీడీపీ ప్రభుత్వం హయాంలో కృషి చేస్తుందని దివంగత ఎన్టీ రామారావు చేనేత వృత్తిని ప్రపంచానికి పరిచయం చేశారని, ఇప్పటికీ చంద్రబాబు అదే రీతిన కృషి చేస్తున్నారు' అని మాజీ ఎమ్మెల్సీ అంగర రామ్మోహన్ అన్నారు. పాలకొల్లు వీవర్స్ కాలనీలో బుధవారం రాత్రి వీవర్స్ యునైటెడ్ ఫ్రంట్ ఆధ్వర్యంలో జరిగిన జాతీయ చేనేత దినోత్సవంలో ముఖ్యఅతిథిగా ఆయన మాట్లాడారు. చేనేత కార్మికులు టీడీపీకి మద్దతుగా నిలవడం అభినందనీయమన్నారు. సభలో కృష్ణా జిల్లా బీజేపీ ఇన్‌చార్జి ఉన్నమట్ల కబర్ది మాట్లాడుతూ ప్రధాని మోదీ ఆదేశాలతో బీజేపీ ఓబీసీ మోర్చా ఆధ్వర్యంలో జాతీయ చేనేత దినోవాన్ని అన్ని చోట్లా వేడుకగా నిర్వహించాయన్నారు. కార్యక్రమానికి జిల్లా దేవాంగ సంక్షేమ సంఘ అధ్యక్షుడు, పాలకొల్లు యునైటెడ్ ఫ్రంట్ అధ్యక్షుడు వట్టం గణేష్ అధ్యక్షత వహించారు. అనంతరం బైక్ ర్యాలీ నిర్వహించారు. మాజీ ఎంపీ నిమ్మల కృష్ణప్ప, మాజీ బీసీ కార్పొరేషన్ చైర్మన్ బొడ్డు వేణుగోపాలరావు, పొన్న మల్లికార్జునరావు, నీలంశెట్టి సత్యప్రసాదు, పెచ్చెట్టిబాబు, జి.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు. అమరావతిలో వున్న రాష్ట్ర మంత్రి నిమ్మల రామానాయుడు సెల్‌ఫోన్ ద్వారా చేనేత కార్మికులకు శుభాకాంక్షలు తెలిపారు.

- తణుకు : నేతన్నల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని పలువురు నాయకులు అన్నారు. బుధవారం ఎమ్మెల్యే ఆరిమిల్లి ఆదేశాలతో టీడీపీ కార్యాలయంలో జాతీయ చేనేత దినోత్సవం నిర్వహించారు. పలువురు చేనేత కార్మికులను సత్కరించారు. చేనేత కార్మికుడు బీరకాయ ప్రసాద్, వావిలాల సరళాదేవి, వావిలాల వెంకట రమేష్, విశ్వనాథం కృష్ణవేణి, గుబ్బల శ్రీనివాసు, చింతలపూడి సన్యాసిరావు తదితరులు పాల్గొన్నారు.
- భీమవరంటౌన్ : యువత, ఉద్యోగులు వారంలో ఒక రోజైనా చేనేత వస్త్రాలను ధరించాలని, చేనేతకు జీవం పోయాలని ఎమ్మెల్యే పులపర్తి అంజిబాబు అన్నారు. భీమవరం పద్మశాలి సంఘం, కరికాల సంఘం, దేవాలయ సంఘం ఆధ్వర్యంలో ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో చేనేత దినోత్సవాన్ని నిర్వహించారు. ఏఎంసీ మాజీ చైర్మన్ కోళ్ల నాగేశ్వరరావు, సంఘం అధ్యక్షుడు టీడీవీ శివప్రసాద్, ఉపాధ్యక్షుడు జ్ఞానపాటి మధుసూదనరావు తదితరులు పాల్గొన్నారు.
- తాడేపల్లిగూడెం రూరల్ : చేనేత కార్మికులకు కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందని బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ ఈతకోట తాతాజీ పేర్కొన్నారు. బుధవారం జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా పట్టణంలోని చేనేత వస్త్ర దుకాణం వద్ద చేనేత వస్త్రాలు కొనుగోలు చేసి ఆయన కార్యకర్తలకు అందించారు. బీజేపీ నాయకులు కోట రాంబాబు, రామగాని సత్యనారాయణ, మారిశెట్టి వెంకట నరసింహమూర్తి, చిట్యాల రాంబాబు తదితరులు పాల్గొన్నారు.
- నరసాపురం రూరల్ :చేనేత కార్మికులు మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా వృత్తి నైపుణ్యం పెంచుకోవాలని ఆర్డీవో అంబరీష్ అన్నారు. జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా లేసు ట్రేడింగ్ సెంటర్‌లో నిర్వహించిన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడారు. అనంతరం చేనేత కార్మికుల్ని ఘనంగా సత్కరించారు. ట్రేడ్ సెంటర్ కన్వీనర్ కలవకొలను తులసీ, కలవకొలను తాతాజీ, సాయిబాబా, గోపాలకృష్ణ, ప్రతాప్, నాగేశ్వరరావు, మావూరి సత్యనారాయణ పాల్గొన్నారు. వీవర్స్ యునైటెడ్ ఫ్రంట్ ఆధ్వర్యంలో నరసా పురంలోని 18వ వార్డులోని భవనం వద్ద సంఘం నాయకులు సమతం చిన్నజెండాను ఎగుర వేశారు.
- పాలకొల్లు అర్బన్/భీమవరం ఎడ్యుకేషన్/గణపవరం/పెనుగొండ : పాలకొల్లు డీఎన్ఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా విద్యార్థినులకు ప్రిన్సిపాల్ డాక్టర్ వి.శోభారాణి అధ్యక్షతన చేనేత వస్త్రధారణ పోటీలు నిర్వహించారు. చేనే త కార్మికుడు చల్లా వీరభద్రంను సత్కరించి, పోటీల్లో విజేతలకు బహుమతులు అందించారు. వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ సి.రవిశంకర్ పాల్గొన్నారు. ఏఎస్ఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ టి.రాజరాజేశ్వరి అధ్యక్షతన విద్యార్థులకు పలు పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందించారు. భీమవరంలోని ఆర్ఆర్‌డీఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ డా.వికెజె ప్రసూన, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ అరవిందస్వామి ఆధ్వర్యంలో, గణపవరం చింతలపాటి మూర్తిరాజు ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో ప్రిన్సిపాల్ డాక్టర్ నిర్మలకుమారి ఆధ్వర్యంలో మహిళా సాధికార విభాగం, ఏకోక్లబ్‌ల ఆధ్వర్యంలో చేనేతపై జరిగిన పోటీల్లో విజేతలకు బహుమతులు అందించారు. పెనుగొండ ఎస్వీకేపీ డాక్టర్ కేఎస్ రాజు ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ వైవీవీ అప్పారావురావు ఆధ్వర్యంలో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. వడలికి చెందిన అందే కోటిలింగం అనే చేనేత కార్మికుడిని సన్మానించారు.

పురోహిత బ్రాహ్మణ కార్యదర్శి బుజ్జికి సత్కారం



బుజ్జిని సత్కరిస్తున్న సంస్థ సభ్యులు

భీమవరంటౌన్, ఆగస్టు 7 : ఆంధ్రప్రదేశ్ పురోహిత బ్రాహ్మణ సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శిగా వేలూరి సుబ్రహ్మణ్యం (బుజ్జి) నియమితులైన సందర్భంగా గునుపూడిలో 'మీ కోసం సేవా సంస్థ' ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. బ్రాహ్మణ సాధికారిత సమితి జిల్లా కన్వీనర్ చెరుకుపల్లి సంతోష్, సంస్థ అధ్యక్షుడు కొమ్ము శ్రీనివాస్, గునుపూడి బ్రాహ్మణ సమాఖ్య అధ్యక్షుడు వేలూరి హనుమ కిరణ్ మాట్లాడుతూ జిల్లాలో సమాఖ్య లక్ష్య సాధనకు కృషి చేయాలన్నారు. సత్కార గ్రహీత బుజ్జి మాట్లాడుతూ ఏపీ పురోహిత బ్రాహ్మణ సమాఖ్య అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. చెరుకుపల్లి సంతోష్, చెరుకుపల్లి రాజ్ కుమార్, మంగంపల్లి సూర్యనారాయణ శర్మ, పురోహితులు పాల్గొన్నారు.

జన గణ మన, వందేమాతరం

గీతాల్లో దేశభక్తి సంపూర్ణం

భీమవరం టౌన్, ఆగస్టు 7 : విశ్వకవి రవీంద్రనాథ్ ఠాగూర్ రచించిన జనగణమన, వందేమాతరం గీతాల్లో దేశభక్తి సంపూర్ణంగా ఇమిడిపోయిందని క్విట్ ఇండియా స్థూల పునఃనిర్మాణ కమిటీ సభ్యులు అరసవల్లి సుబ్రహ్మణ్యం, లయన్స్ క్లబ్ ఉపాధ్యక్షుడు నరహరిశెట్టి కృష్ణ అన్నారు. శ్రీవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 76వ స్వాతంత్ర్య దినోత్సవ పక్షోవాల్లో భాగంగా పీఎస్ఎం హైస్కూల్లో రవీంద్రనాథ్ ఠాగూర్, చటర్జీల సంస్మరణ కార్యక్రమాలు, వందేమాతరం, జనగణమన గీతాలను విద్యార్థులతో ఆలపించారు. హైస్కూల్ హెచ్ఎం వారణాసి రాధాకృష్ణ, రచయిత ఉపాధ్యాయుని కె.మాధవి గీతాల సారాంశాలను వివరించారు. కన్వీనర్ చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ పీఎస్ఎం, సర్ సీవీ రామన్ హైస్కూల్లో విద్యార్థులకు వ్యాసరచన, చిత్ర లేఖనం పోటీలను నిర్వహించామని, ముగింపు రోజున బహుమతులను అందిస్తామన్నారు. సీవీ రామన్ స్కూల్ డైరెక్టర్ రవణం వేణుగోపాల్, ప్రిన్సిపాల్ సరిత, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ విద్యార్థులకు పాఠ్యపుస్తకాల అందజేత

ఆచంట, ఆగస్టు 7 : కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఇంటర్ విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు, నోటు పుస్తకాలు అందిస్తున్న ఘనత కూటమి ప్రభుత్వానిదేనని జడ్పీటీసీ ఉప్పలపాటి సురేష్‌బాబు, ఎంపీపీ దిగుమర్తి సూర్యకుమారి అన్నారు. ప్రభుత్వం సరఫరా చేసిన ఇంటర్ పాఠ్య పుస్తకాలను బుధవారం స్థానిక ఎంవీవీఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు అందజేశారు. కళాశాల ప్రిన్సిపాల్ శ్రీదేవి, వైస్ ఎంపీపీ యర్రగొప్పుల నాగరాజు, జవ్వాది బాలాజీ, మీరయ్య, తమ్మినీడి ప్రసాద్, నంబూరి విజయ్, ప్రభాకరరావు పాల్గొన్నారు.

400 మందికి ఉచిత వైద్య పరీక్షలు

పెనుగొండ, ఆగస్టు 7 : భవిష్యత్తులో మంచి కార్యక్రమాలు ప్రజలందరికి ఉపయోగపడాలని భీమవరం ఓల్డ్ ఏజ్ హోమ్ ఫౌండర్ నిమ్మలూరి లక్ష్మీ నారాయణ అన్నారు. ములపర్రులో బీవీ రమణ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో మెగా ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఏలూరు ఆశ్రం, భీమవరం విష్ణు, పాలకొల్లు రాజవల్లి రాధారమణ్ కంటి లయన్స్, విజయ డయాగ్నస్టిక్ పాలకొల్లు వారి ఆధ్వర్యంలో 400 మందికి ఉచిత వైద్య పరీక్షలు చేశారు. అనంతరం ములపర్రు చుట్టుపక్కల ప్రాంతాల వారికి కైలాస రథం ఫ్రీజర్ బాక్స్, ఉచిత అత్యవసర మోటారుసైకిల్, ఆక్సిజన్ కాన్సెట్రేటర్ ప్రారంభించారు. కె.స్వామినాథన్, కె.సీతారామన్, ఎస్ఎస్ రాజు, మన్నె రామ్మోహనరావు, బుచ్చిశ్వరరావు పాల్గొన్నారు.

దాడిచేసిన నలుగురిపై కేసు నమోదు

ఆకివీడు, ఆగస్టు 7 : స్థానిక బంకులో పెట్రోలు కొట్టించుకొని ఇంటికి వెళ్తుండగా నలుగురు దాడిచేసినట్టు ఓ వ్యక్తి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్ఐ బత్తిన నాగబాబు తెలిపారు. స్థానిక కోసూరి వీధిలో నివాసముంటున్న మహ్మద్ షారూ పూలకొట్టులో పని చేస్తుంటాడు. మంగళవారం రాత్రి షారూ ఇంటికి వెళ్ళే సమయంలో గుమ్ములూరు సెంటర్‌లోని బంకులో పెట్రోలు కొట్టించుకొని వెళుతుండగా అయ్యప్ప, రఘులతో పాటు మరో ఇద్దరు అడ్డగించి దాడి చేయడంతో రక్త గాయాలు అయ్యాయి. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ బుధవారం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

శ్రీకృష్ణ దేవరాయుల పట్టాభిషేక దినోత్సవం



శ్రీకృష్ణ దేవరాయుల విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న సేవా సమితి సభ్యులు

పాలకొల్లు అర్బన్, జూలై 7 : శ్రీకృష్ణ దేవరాయ సేవా సమితి ఆధ్వర్యంలో శ్రీకృష్ణ దేవరాయుల 515వ పట్టాభిషేక దినోత్సవం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు యర్రం శెట్టి వెంకటరత్నం, సభ్యులు కెనాల్ రోడ్డులోని శ్రీకృష్ణ దేవరాయుల విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా శ్రీకృష్ణదేవరాయుల పరిపాలన వైశిష్ట్యాన్ని సభికులు వివరించారు. సుంకర గణేష్, పినిశెట్టి శ్రీనివాస్, మండెల ఫణినాథ్, రాయి సూరిబాబు, గుండుమో గుల వీరాస్వామి, పూలపల్లి సందీప్, యడ్ల మురళీకృష్ణ, వై.రతన్‌జీ, వై.మోక్షిత పాల్గొన్నారు.

పాఠశాలకు రూ.లక్ష విలువైన సామగ్రి అందజేత



విద్యా సామగ్రి అందజేసిన లయన్స్ క్లబ్ సభ్యులు

ఆకివీడురూరల్ ఆగస్టు 7 : కళింగపాలెం ఎంపీయూపీ పాఠశాలలోని విద్యార్థులకు రూ.లక్ష విలువైన నోట్ పుస్తకాలు, మైక్ సెట్‌లు, వాటర్ ప్లాంటు మరమ్మతుల నిర్మాణానికి నగదును ఆకివీడు లయన్స్‌క్లబ్, దాత గాయజుద్దీన్ అందజేశారు. విద్యాభివృద్ధికి లయన్స్‌క్లబ్, దాతల కృషి అభినందనీయమని అన్నారు. లయన్స్‌క్లబ్ సభ్యులు దాసరి సత్యనారాయణ, కృష్ణంరాజు, గాయజుద్దీన్, నెల్లి సతీష్‌కుమార్, ఎంఇవో సీతారామయ్య, బొబ్బిలి బంగారయ్య, గురువెల్లి రఘుప్రసాద్, నెల్ల వైభవి, డి.శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

- దుంపగడప జడ్పీ ఉన్నత పాఠశాలకు ఆదర్శ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో కంప్యూటర్ ప్రింటర్‌ను అందజేశారు. లయన్స్ క్లబ్ సభ్యులు కాకర్ల రాజరాజేశ్వరి, మోటుపల్లి శ్రీనివాసరావు, రామచెంచయ్య, హెచ్ఎంలు ప్రసాద్, భమిడిపాటి భాస్కరరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మావుళ్లమ్మకు తెలంగాణ ఎన్నికల కమిషనర్ పూజలు

భీమవరంటౌన్, ఆగస్టు 7 : మావుళ్ళమ్మ అమ్మవారిని తెలంగాణ ఎన్నికల కమిషనర్ సి.పార్థసారథి దర్శించుకున్నారు. ఆలయానికి వచ్చిన ఆయనకు దేవస్థానం అధికారులు స్వాగతం పలికారు. తొలుత అమ్మవారిని దర్శించుకోగా వారి పేరిట ప్రధానార్చకుడు మల్లికార్జునశర్మ పూజలు నిర్వహించి ఆశీర్వచనాలు అందించి ప్రసాదాలు శేషవస్త్రం ఫొటో అందించారు.

ఎమ్మెల్యే పితానికి బాబ్జి పరామర్శ

తాడేపల్లిగూడెం అర్బన్, ఆగస్టు 7: ఆచంట ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ సోదరుడు సూర్యనారాయణ ఇటీవల మరణించడంతో టీడీపీ తాడేపల్లిగూడెం నియోజకవర్గ ఇన్‌చార్జి వలవల బాబ్జి బుధవారం ఎమ్మెల్యే పితానిని పరామర్శించారు. సూర్యనారాయణ చిత్రపటం వద్ద నివాళులర్పించారు. పోతుల అన్నవరం, కిలపర్తి వెంకట్రావు, దాసరి అప్పన్న, పరిమి రవికుమార్, పట్నాల రాంపండు, గంధం సతీష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజారోగ్యమే ముఖ్యం : కలగర

తణుకు, ఆగస్టు 7: ప్రజల ఆరోగ్యమే ప్రభుత్వ లక్ష్యమని టీడీపీ పట్టణ అధ్యక్షుడు కలగర వెంకటకృష్ణ అన్నారు. బుధవారం 10, 34వవార్డుల్లోని డ్రెంయిన్లలో సిల్టు, పిచ్చిమొక్కలు తొలగింపు పనులను పర్యవేక్షించారు. టీడీపీ నాయకులు తాతపూడి మారుతీరావు, ఒమ్మి రాంబాబు, తోట ఏసు పాల్గొన్నారు.

రేపు అమ్మవార్ల విగ్రహాల ప్రతిష్ఠ

ఆకివీడురూరల్ ఆగస్టు 7 :కోళ్లపర్రులోని రాజులపేటలో నూతనంగా నిర్మించిన ఆలయంలో లక్ష్మీదేవి, పుంతలో ముసలమ్మ అమ్మవార్ల నూతన విగ్రహాల ప్రతిష్ఠాకార్యక్రమం ఈనెల 9న ఉదయం జరుగుతుందని ఎంపీటీసీ రామచంద్రరాజు తెలిపారు. బుధవారం అమ్మవార్ల విగ్రహాలను గ్రామంలో ఊరేగించారు. గురువారం హోమాలు జరుగుతాయని, శుక్రవారం శైవాగమ పండితులు లంక జలదుర్గాప్రసాద్ ఆధ్వర్యంలో విగ్రహాల ప్రతిష్ఠ, అన్న సమారాధన జరుగుతుందని భక్తులు విచ్చేసి తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని కోరారు.

ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరందించాలి : బొలిశెట్టి



ఎమ్మెల్యే బొలిశెట్టికి మొక్క అందిస్తున్న అధికారులు

తాడేపల్లిగూడెం అర్బన్, ఆగస్టు 7: ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందించాలని ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ అన్నారు. బుధవారం జడ్పీ సీఈవో కేఎస్ సుబ్బారావు ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలసి సత్కరించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వం ప్రజలకు తాగు నీరు అందించడంలో పూర్తిగా విఫలమైందన్నారు. గ్రామాల వారీగా మంచినీటి అవసరాలు గుర్తించి ప్రజలకు ఇబ్బంది లేకుండా తాగునీరందించాలని, నిధులు అవసరమైతే ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌తో మాట్లాడతానన్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ, ఎంపీడీవో ఎస్ఎస్ శర్మ, అధికారులు పాల్గొన్నారు.

క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు చేయించుకోవాలి : ధర్మరాజు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ధర్మరాజు

గణపవరం, ఆగస్టు 7: రాష్ట్ర ప్రభుత్వం ఈనెల 15 నుంచి గ్రామాల్లో క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహిస్తోందని ఉంగుటూరు ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు తెలిపారు. గణపవరం, నిడమర్రు మండలాల పీఎంపీల అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక లయన్స్‌క్లబ్ ఆడిటోరియంలో క్యాన్సర్‌పై అవగాహన సదస్సు బుధవారం నిర్వహించారు. సదస్సుకు గణపవరం మండల పీఎంపీల అధ్యక్షుడు ఎం.సత్యనారాయణమూర్తి అధ్యక్షత వహించారు. భీమవరానికి చెందిన క్యాన్సర్ వైద్యనిపుణుడు ఎస్.సుధీర్‌వర్మ క్యాన్సర్ వ్యాధులపై పీఎంపీలకు అవగాహన కల్పించారు. తొలుత గ్రామంలో నిర్వహించిన క్యాన్సర్‌పై అవగాహన ర్యాలీలో ఎమ్మెల్యే ధర్మరాజు పాల్గొన్నారు. పీఎంపీల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వీటీటీ రాజు, రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు నిడమర్తి జయసూర్య, జిల్లా అధ్యక్షుడు ఏఆర్‌కే పరమేశ్వర్లు, మండల ప్రధాన కార్యదర్శి వి.శివశ్రీనివాసరావు, ఉపాధ్యక్షుడు ప్రభాకరరావు, సంఘ సభ్యులు పాల్గొన్నారు.



నూతన కార్యవర్గంతో ప్రమాణ స్వీకారం చేయిస్తున్న ప్రజాప్రతినిధులు

దేవాలయాల అభివృద్ధికి కమిటీలు పాటుపడాలి

ఆకివీడు, ఆగస్టు 7 : దేవాలయాల అభివృద్ధికి నూతన కమిటీలు పాటుపడాలని జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి జుత్తుగ నాగరాజు, డీసీసీబీ మాజీ చైర్మన్ ముత్యాల రత్నం, టీడీపీ సీనియర్ నాయకులు గొట్టుముక్కల వెంకట సత్యనారాయణరాజు అన్నారు. శాంతినగర్ వరసిద్ధి వినాయకస్వామి దేవాలయ కమిటీ నూతన కార్యవర్గం అధ్యక్షుడు సప్పా మణికంఠ, కార్యదర్శి ఓసూరి శ్రీనివాసరావు, కోశాధికారి వి.వి.రాజు, సిబ్బందితో ప్రజాప్రతినిధులు ప్రమాణ స్వీకారం చేయించారు. టీడీపీ పట్టణ అధ్యక్ష కార్యదర్శి బొల్లా వెంకట్రావు, గంధం ఉమా, మాజీ సర్పంచ్ గొంట్లా గణపతి తదితర టీడీపీ, జనసేన నాయకులు తదితరులు ఉన్నారు.

వరద బాధితులకు నిత్యావసరాల పంపిణీ



బాధితులకు నిత్యావసరాలు అందిస్తున్న ఎమ్మెల్యే బొమ్మిడి, పొత్తూరి

నరసాపురం టౌన్, ఆగస్టు 7: పట్టణంలో ముంపు బారిన పడకుండా గోదావరి గట్టును పటిష్ఠపరుస్తామని ఎమ్మెల్యే నాయకర్ అన్నారు. బుధవారం పొన్నపల్లి, లాకుపేట ప్రాంత వరద బాధితులకు ఆయన టీడీపీ ఇన్‌చార్జి పొత్తూరి రామరాజుతో కలిసి నిత్యావసరాలు పంపిణీ చేశారు. అనంతరం మండలంలోని లక్ష్మణేశ్వరం, వేములదీవి గ్రామాల్లో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. తహసీల్దార్ సీతారత్నం, చైర్‌పర్సన్ వెంకటరమణ, పొన్నాల నాగాబాబు, శశిదేవి, యుగంధర్ పాల్గొన్నారు.

జిల్లాలో 11 మంది ఎస్ఐల బదిలీ

భీమవరం క్రైం, ఆగస్టు 7 : జిల్లాలో పనిచేస్తున్న 11 మంది ఎస్ఐలకు స్థానచలనం కల్పిస్తూ ఉత్తర్వులు అందించామని ఎస్పీ అదనాన్ నయీమ్ అస్మి తెలిపారు. బదిలీ అయిన వారు వెంటనే విధుల్లో చేరాలని ఆదేశాలు జారీ చేశారు.

పేరు	ప్రస్తుత స్థానం	బదిలీ స్థానం
1. ఫాజల్ రహమాన్	డీటీసీ పశ్చిమ జిల్లా	భీమవరం టూటౌన్
2. జేవీఎస్ ప్రసాద్	తాడేపల్లిగూడెం టౌన్	తాడేపల్లిగూడెం రూరల్
3. పెద్దిరెడ్డి సురేష్	తాడేపల్లిగూడెం రూరల్	వీఆర్ భీమవరం
4. సీహెచ్ జయలక్ష్మి	దిశ స్టేషన్, భీమవరం	నరసాపురం టౌన్ స్టేషన్
5. కె.చంద్రశేఖర్	తణుకు రూరల్ స్టేషన్	తణుకు టౌన్ పోలీస్‌స్టేషన్
6. ఎన్.శ్రీనివాసరావు	పాలకోడేరు పోలీస్‌స్టేషన్	కాళ్ళ పోలీస్‌స్టేషన్
7. వీఎస్‌వీ భద్రరావు	కాళ్ళ పోలీస్‌స్టేషన్	వీఆర్ భీమవరం
8. జానా సతీష్	దిశ స్టేషన్, భీమవరం	అటాచ్డ్‌టూ తణుకు ట్రాఫిక్ నుంచి ఇరగవరం స్టేషన్
9. డి.ఆదినారాయణ	ఇరగవరం పోలీస్‌స్టేషన్	తణుకు ట్రాఫిక్ స్టేషన్
10. కె.గుర్రయ్య	నరసాపురం రూరల్ పోలీస్‌స్టేషన్	యలమంచిలి పోలీస్‌స్టేషన్
11. కె.శివన్నారాయణ	యలమంచిలి పోలీస్‌స్టేషన్	వీఆర్ భీమవరం

అధికారులు బాధ్యతల స్వీకరణ

ఆకివీడు సర్కిల్ సీఐగా జగదీశ్వరరావు



సీఐ జగదీశ్వరరావుకు బొకే అందిస్తున్న బదిలీపై వెళుతున్న సీఐ

ఆకివీడు/తణుకు/పాలకొల్లు రూరల్/యలమంచిలి/ తాడేపల్లిగూడెం రూరల్/ఇరగవరం, ఆగస్టు 7 : ఆకివీడు సర్కిల్ సీఐగా వి.జగదీశ్వరరావు బుధవారం బాధ్యతలు చేపట్టారు. కొవ్వూరు సర్కిల్ నుంచి ఆకివీడుకు బదిలీపై వచ్చారు. ఆకివీడు నుంచి బదిలీపై వెళ్ళిన సీఐ కుడుపూడి వీర వెంకటనాగ సత్యనారాయణ, ఆకివీడు, కాళ్ళ ఎస్ఐలు బత్తిన నాగబాబు, విశ్వ వీరభద్రరావు, పోలీసులు అభినందించారు. తణుకు పట్టణ పోలీసు స్టేషన్ ఇన్స్పెక్టర్‌గా ఎన్.కొండయ్య బుధవారం బాధ్యతలు స్వీకరించారు. తణుకులో పనిచేసిన నాగరాజు భీమవరం బదిలీపై వెళ్లారు. పాలకొల్లు పట్టణ సర్కిల్ ఇన్స్పెక్టర్‌గా కోలా రజనీ కుమార్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకూ ఇక్కడ సీఐగా పనిచేస్తున్న కె.మంగాదేవి బదలీపై రాజమండ్రి పట్టణ సీఐగా వెళ్లారు. సీఐ రజనీ కుమార్‌ను బుధవారం ఉదయం పంచారామ క్షేత్రమైన క్షీరా రామలింగేశ్వర స్వామిని, అమ్మవార్లను దర్శనం చేసుకుని ప్రత్యేక పూజలు చేశారు. యలమంచిలి మండలం ఎస్ఐగా కర్నీడి గుర్రయ్య బుధవారం బాధ్యతలు చేపట్టారు. గుర్రయ్య నరసాపురం రూరల్ ఎస్ఐగా పనిచేసి బదిలీపై యలమంచిలి వచ్చారు. తాడేపల్లిగూడెం రూరల్ ఎస్ఐగా ఎల్‌వీఎస్ ప్రసాద్ బాధ్యతలు స్వీకరించారు. తాడేపల్లిగూడెం పట్టణ ఎస్ఐగా పనిచేసి బదిలీపై రూరల్ స్టేషన్‌కు వచ్చారు. ఇరగవరం మండల ఎస్ఐగా జానా సతీష్ బుధవారం బాధ్యతలు చేపట్టారు. గతంలో తణుకు పట్టణ ట్రాఫిక్ ఎస్ఐగా పనిచేసి ఇరగవరం మండలానికి బదిలీపై వచ్చారు. ప్రస్తుతం ఇరగవరం ఎస్ఐగా విధులు నిర్వర్తిస్తున్న డి. ఆదినారాయణ తణుకు పట్టణ ట్రాఫిక్ ఎస్ఐగా బదిలీపై వెళ్లారు.

- తాడేపల్లిగూడెం రూరల్/ ఉండి, :తాడేపల్లిగూడెం తహసీల్దార్‌గా సునీల్‌కుమార్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయనకు ఇన్‌చార్జి తహసీల్దార్ శివశంకర్ బాధ్యతలు అప్పగించి అభినందనలు తెలిపారు. ఉండి మండలం ఉండి తహసీల్దార్ కె.నాగార్జున బాధ్యతలను స్వీకరించారు. రెవెన్యూ ఉద్యోగులు విచ్చేసి అయనకు స్వాగతం పలికారు.